

జెసిబి సహాయంతో బోర్డును తొలగిస్తున్న పంచాయతీ కార్యదర్శి శోభన

## 36 ఎకరాల లేఅవుట్

# నేలమట్టం

అక్రమ వెంచర్‌పై నోటీసులు ఇచ్చినా బేఖాతరు..

**యథేచ్ఛగా పనులు కొనసాగిస్తున్న వెంచర్ నిర్వాహకులు**

**పంచాయతీ అధికారులు సీరియస్**

**జెసిబిలతో క్షేత్రస్థాయిలో విరుచుకుపడ్డ సిబ్బంది**

**ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ, ఎటువంటి అనుమతులు లేకుండా ధారూర్ స్టేషన్ పరిధిలో సాగుతున్న భారీ రియల్ ఎస్టేట్ వ్యాపారానికి పంచాయతీ యంత్రాంగం చెక్ పెట్టింది. ముందస్తు నోటీసులు ఇచ్చినప్పటికీ మొండిగా పనులు కొనసాగించడంతో, శనివారం పంచాయతీ కార్యదర్శి శోభన ఆధ్వర్యంలో సిబ్బంది జేసీబీలతో విరుచుకుపడి ప్లాట్ల హద్దులను, బోర్డులను పూర్తిగా ధ్వంసం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు తప్పవని అధికారులు ఈ సందర్భంగా హెచ్చరించారు.**

**ధారూర్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ, ఎటువంటి అనుమతులు లేకుండా అడ్డగోలుగా వెలుస్తున్న అక్రమ రియల్ ఎస్టేట్ వ్యాపారానికి ధారూర్ పంచాయతీ యంత్రాంగం గట్టి చెక్ పెట్టింది. నిబంధనలు అతిక్రమిస్తే ఊరుకునేది లేదని హెచ్చరిస్తూ శనివారం భారీ కూల్చివేత కార్యక్రమాన్ని చేపట్టింది. మండల పరిధిలోని ధారూర్ స్టేషన్ గ్రామ రెవెన్యూ పరిధిలో గల సర్వే నంబర్ 385, 392లలో సుమారు 36 ఎకరాల భారీ విస్తీర్ణంలో కొందరు నిర్వాహకులు అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేశారు. ఎటువంటి లేఅవుట్ పర్మిషన్లు లేకుండా సాగుతున్న ఈ పనులను గుర్తించిన పంచాయతీ అధికారులు, ఈ నెల 10వ తేదీనే నిర్వాహకులకు ముందస్తు నోటీసులు జారీ చేశారు. తక్షణమే పనులు నిలిపివేసి, చట్టపరమైన అనుమతులు పొందిన తర్వాతే పనులు మొదలుపెట్టాలని ఆదేశించినప్పటికీ, నిర్వాహకులు ఆ హెచ్చరికలను ఏమాత్రం లెక్కచేయలేదు.

**క్షేత్రస్థాయిలో విరుచుకుపడ్డ సిబ్బంది..**

ప్రభుత్వ ఆదేశాలను తుంగలో తొక్కి యథేచ్ఛగా వెంచర్ పనులను కొనసాగించడంతో, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం పంచాయతీ కార్యదర్శి శోభన ఆధ్వర్యంలో సిబ్బంది రంగంలోకి దిగారు. వెంచర్లో ఏర్పాటు చేసిన ప్లాట్ల హద్దులను, ప్రచార బోర్డులను, నామఫలకాలను జేసీబీల సహాయంతో పూర్తిగా ధ్వంసం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా కార్యదర్శి శోభన హెచ్చరించారు.ప్రజలు జాగ్రత్త.. పత్రాలు పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేయండి అమాయక ప్రజలు ఇటువంటి అనుమతులు లేని అక్రమ వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసి తమ కష్టార్జితాన్ని పోగొట్టుకోవద్దని పంచాయతీ కార్యదర్శి సూచించారు. ప్లాట్లు కొనుగోలు చేసే ముందు లేఅవుట్ అనుమతులకు సంబంధించిన అన్ని పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త







# బాత్రూమే ఆమెకు గూడు!

**పూడూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** అది ఓ ఆదర్శగ్రామం. మండలంలో చిన్నగ్రామమైనా ప్రజాప్రతినిధుల ప్రోత్సాలంతో పెద్ద గ్రామాలకు దక్కని గుర్తింపు దక్కింది. అక్కడ ఇండ్లులేని పేదప్రజలను గుర్తించి, ఇందిరమ్మ పథకం కింద లబ్ధిదారులను ఎంపికచేసి, సకాలంలో ఇళ్లు నిర్మించి గృహప్రవేశాలు చేయించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం. అయితే అధికారుల నిర్లక్షమో? లేక ప్రజా ప్రతినిధుల ఆలసత్వమో? తెలియదు కాని అక్కడ ప్రతిష్టాతకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కాస్త పడకేసింది. దీంతో ఇళ్లు లేని రూఫ్‌లేవల్లో మరికొన్ని అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం గతంలో ఉన్న పాత ఇళ్లను కూల్చివేసిన చెంచులు ఆరుబయటే గుడిసెలు వేసుకొని కాలం గడుపుతున్నారు. దీంతో గతవారం రోజుల కింద కురిసిన భారీ వర్షానికి గుడిసె కూలి పోవడంతో ఆర్ లక్ష్మమ్మ అనే



అర్ధాంతరంగా నిలిపివేసిన ఇందిరమ్మ ఇళ్ల పనులు. (ఇన్‌సెట్)పూరిగుడిసె కూలిపోవటంతో బాత్రూమ్‌లోనే నిద్రిస్తున్న వృద్ధురాలు

లబ్ధిదారులు కొందరు ఆరుబయటే పగలు రాత్రి జీవనం సాగిస్తున్నారు. గతవారం కింద కురిసిన వర్షాలకు వారు ఎదుర్కొన్న కష్టాలు వర్ణనాతీతం. ఈ పరిస్థితి ఎక్కడోకాదు. వికారాబాద్ జిల్లా పూడూరు మండలానికి చెందిన ఎన్కెపల్లి పంచాయతితోపాటు, దాని అనుబంధ గ్రామం చెంచుపల్లిలోనే. ఈ గ్రామం 2024-25 సంవత్సరంలో ఆదర్శ గ్రామంగా ఎంపికైంది. ఎన్కెపల్లి, చెంచుపల్లి గ్రామాల్లో అధికారులు అప్పట్లో సర్వేచేసి 241మంది ఇళ్లు లేని పేదలను గుర్తించారు. వారికి ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారులుగా ఎంపికచేసి ప్రొసీడింగ్‌లు అందజేశారు. సుమారు 45 రోజుల్లో లబ్ధిదారులు సొంతంగా ఇంటి నిర్మాణం చేపడితే, బేస్‌మెంట్, రూఫ్‌లెవెల్, స్లాబ్, ఇళ్ల నిర్మాణం పూర్తి అయిన తరువాత 4 విడతలుగా బిల్లులు చెల్లించాలన్నది ప్రభుత్వ నిబంధన. అయితే చెంచుపల్లి గ్రామంలో పూర్తిగా ఆర్థికంగా వెనుకబడిన (చెంచు) కులానికి చెందిన ఎస్‌టిలు. డబ్బులు పెట్టుబడి పెట్టి ఇళ్ల నిర్మాణం చేపట్టే స్తోమత వారికి లేదు. దీంతో వారి ఇళ్లను నిర్మించేందుకు నాటి స్థానిక ప్రజా ప్రతినిధులు ఓ ప్రైవేటు కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. ప్రభుత్వ నిర్ణీత గడువులోపల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి లబ్ధిదారులకు ఇవ్వాలన్నదే కాంట్రక్టర్‌తో అప్పట్లో కుదుర్చుకున్న ఒప్పందం. అయితే సదరు కాంట్రాక్టర్ సకాలంలో ఇళ్లను నిర్మించక పోవడంతో బేస్‌మెంట్ లేవల్‌లో కొన్ని, వృద్ధురాలు బాత్రూంలోనే నివాసం ఉంటోంది. ఈ విషయమై సదరు కాంట్రాక్టర్‌ను పలుమార్లు చెరవాణిద్వారా సంప్రదించినా కనీసం స్పందన లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఇది ఇలా ఉండగా ఎన్కెపల్లి గ్రామ పంచాయతీకి 241 ఇందిరమ్మ ఇండ్లు మంజూరుకాగా 111 ఇండ్లు రద్దు అయినట్లు పలువురు వివరించారు.

**విద్యుత్తు వైర్లవల్లనే ఇల్లు నిర్మించనంటున్నాడు : లబ్ధిదారు లక్ష్మమ్మ**

ఇందిరమ్మ ఇంటిపై విద్యుత్తు వైర్లు ఉండడంతో నిర్మాణం పనులు కొనసాగించలేనని కాంట్రాక్టర్ తెగేసి చెప్పినట్లు లబ్ధిదారు లక్ష్మమ్మ ఆవేదన వ్యక్తంచేసింది. ఇంటిపైన ఉన్న విద్యుత్తు వైర్లను తొలగించాలని పలుమార్లు సంబంధిత శాఖ అధికారులకు విన్నవించినా ఫలితంలేదని వాపోయింది.దీంతో రూఫ్ లేవల్‌వరకు వచ్చి అర్ధాంతరంగా ఇల్లు నిర్మాణం ఆగిపోవడంతో గత్యంతరంలేక బాత్రూంలో కాలం గడుపుతున్నట్లు వివరించింది ఆ వృద్ధురాలు.

**రాజకీయం కోసమే ఇందిరమ్మ ఇళ్లలో కోత : సర్పంచ్ దయాకర్**

రాజకీయ లబ్ధికోసమే ఇందిరమ్మ ఇళ్లలో కోతవిధించారని సర్పంచ్ దయాకర్ ఆరోపించారు. ఆదర్శ గ్రామంగా ఎంపికైన సమయంలో ఎన్కెపల్లి పంచాయతీకి 241 ఇందిరమ్మ ఇళ్లను మంజూరిచేసి ఎన్కెపల్లి, దాని అనుబంధ గ్రామం చెంచుపల్లిలోని లబ్ధిదారులకు ప్రొసీడింగులు అందజేశారని గుర్తు చేశారు. అయితే పంచాయతీ ఎన్నికల అనంతరం మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో స్థానిక మాజీ ప్రజాప్రతినిధితో అధికారులు కుమ్మక్కై రాజకీయ వివక్ష చూపించారని ఆరోపించారు. నాన్‌స్టార్టెడ్ పేరుతో 111 మంది అర్హులైన లబ్దిదారుల పేర్లను తొలగించారని మండిపడ్డారు. ఈ విషయమై పలుమార్లు తాను ఎంపిడిఒకు మెమోరాండాన్ని అందజేశానని, సుమారు 35మంది లబ్దిదారులు ఇండ్లు నిర్మించుకునేందకు సిద్ధంగా ఉన్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**చెదిరిన సొంతింటి కల**

**ఎన్కెపల్లి గ్రామానికి గత ఏడాది 240 ఇందిరమ్మ ఇళ్లు**

**సగం నిర్మించి వదిలేసిన కాంట్రాక్టర్..**

**విద్యుత్ తీగలు ఉన్నాయని సాకులు**

**వర్షానికి కూలిన లబ్ధిదారుల గుడిసెలు**

**తలదాచుకునే జాగాలేక అవస్థలు**

**బాత్రూంలోనే ఓ వృద్ధురాలి నివాసం**

**గ్రౌండింగ్ కాలేదని 111 ఇళ్ల రద్దు?**

**కలెక్టరేట్ వద్ద ధర్నాకు దిగుతామని సర్పంచ్ హెచ్చరిక**

## ఆదర్శ గ్రామంలో అగచాట్లు

**ఆదర్శ గ్రామంగా గుర్తింపు దక్కించుకున్నా.. ఆ ఊరి వాసులకు కష్టాలు తప్పడం లేదు. అక్కడ గూడు లేని నిరేపేదల సొంతింటి కల చెదిరింది. గిరిజనులు తమ పాత ఇళ్లను కూల్చివేసి, కాంట్రాక్టర్ ఇళ్ల పనులు పూర్తి చేస్తాడని ఆశపడి ప్రస్తుతం రోడ్డున పడ్డారు.**



ఇందిరమ్మ ఇళ్ల పనులకు అవరోధంగా మారిన విద్యుత్ స్తంభం

అదే విధంగా చెంచుపల్లి గ్రామానికి చెందిన సుమారు 50 ఇండ్లను నాటి పాలకులు కాంట్రాక్టర్‌కు అప్పగించడంతో సదరు కాంట్రాక్టర్ సకాలంలో ఇండ్లు నిర్మించక మొహం చాటేశాడని, దీంతో నిరుపేద చెంచులు అర్ధాంతరంగా ఆగిన ఇండ్లతో ఆరుబయట నివాసాలు ఉండే పరిస్థితి ఏర్పడిందని ఆవేధన వ్యక్తంచేశారు. ఈ విషయమై ప్రభుత్వాధికారులు స్పందించకుంటే లబ్ధిదారులతో కలిసి కలెక్టరేట్ ముందు దర్నాకు దిగుతామని హెచ్చరించారు.

# స్క్రీనింగ్ తీరుపై కలెక్టర్ అసహనం




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

**100 శాతం లక్ష్యం సాధించాల్సిందే**

**టి.బి. రహిత జిల్లా దిశగా చర్యలు**

**ఆరోగ్య సిబ్బందికి కలెక్టర్ దీపక్ తివారి దిశానిర్దేశం**

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త:** జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మాతా శిశు సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, గర్భవతులకు అన్ని రకాల వైద్య సేవలను అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మాతా శిశు సంరక్షణలో భాగంగా గర్భవతులకు సేవలు అందిస్తూనే, ఆ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా జిల్లాలో మాతృ మరణాలు సంభవించకుండా అత్యంత జాగ్రత్తలు వహించాలని స్పష్టం చేశారు. జిల్లాలో అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్ ప్రస్తుతం 62 శాతం మాత్రమే నమోదైందని, దీనిని వంద శాతం పూర్తి చేసేందుకు వైద్యులు ప్రత్యేక కృషి చేయాలని ఆయన ఆదేశించారు. అలాగే టి.బి వ్యాధిగ్రస్తులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ అయిన వారందరికీ సకాలంలో చికిత్స అందించాలని, వారి వివరాలను నిశ్చయ్ ఆన్‌లైన్ పోర్టల్‌లో క్రమం తప్పకుండా నమోదు చేయాలని తెలిపారు. 14 నుంచి 15 ఏళ్ల వయస్సు గల బాలికలకు సర్వైకల్ క్యాన్సర్ నివారణ కోసం ప్రత్యేక డ్రైవ్ ద్వారా హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తు న్నామని, అయితే లక్ష్యం మేరకు వ్యాక్సినేషన్ జరగడం లేదని కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియను వేగ వంతం చేసేందుకు విద్యాశాఖ మరియు సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. శిశు మరణాల నియంత్రణ కోసం ప్రత్యేకంగా అమలు చేస్తున్న సంకల్ప్ కార్యక్రమంపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, ఆసుపత్రి సూపరిండెంట్లు సమన్వయ సమావేశాలు నిర్వహించు కోవాలని సూచించారు. జిల్లాలోని 23 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు తప్పనిసరిగా జాతీయ నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, మౌలిక వసతుల కల్పన కోసం అవసరమైన అంచనాలు రూపొందిస్తే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఇకపై ప్రతి వారం అన్ని ఆరోగ్య కేంద్రాల నుండి ప్రగతి నివేదికలను సేకరించి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.స్వర్ణ కుమారి జిల్లాలో అందుతున్న వైద్య సేవలు, సాధించిన పురోగతిని కలెక్టరుకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ సుధీర్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్లు, ప్రోగ్రాం అధికారులు మరియు డిప్యూటీ డిఎంహెచ్ఒలు పాల్గొన్నారు.



తూంకుంట హైస్కూల్ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

# సౌకర్యాల కల్పనకు గ్రీన్ సిగ్నల్

**తూంకుంట జడ్‌పి హైస్కూల్‌లో ఆకస్మిక తనిఖీ**

**పాఠశాలలో కొత్త బోర్ వేయాలని కలెక్టర్ ఆదేశం**

**అదనపు గదులు, మరుగుదొడ్ల నిర్మాణానికి అంగీకారం**

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి శామీర్‌పేట మండలంలోని తూంకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం సందర్శించి, పాఠశాల పరిస్థితులను స్వయంగా పర్యవేక్షించారు. విద్యార్థుల సౌకర్యాలపై ఆరా తీశారు. తరగతి గదులను , కంప్యూటర్ ల్యాబ్‌ను నిశితంగా పరిశీలించారు. ఒకే ప్రాంగ ణంలో హైస్కూల్, ప్రైమరీ స్కూల్ నడుస్తు న్నందున, విద్యార్థులకు అవసరమైన కనీస సదు పాయాల కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అధికారులను ఆదేశించారు.

**నీటి ఎద్దడిపై తక్షణ స్పందన**

పాఠశాలలో తీవ్రమైన నీటి ఎద్దడి ఉందని, మున్సిపల్ వాటర్ అవసరాలకు సరిపోవడం లేదని హెడ్ మాస్టర్ కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్, తక్షణమే కొత్త బోర్ వేయించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**మౌలిక సదుపాయాల మెరుగుదల**

పాఠశాలకు అదనపు తరగతి గదులు, మరుగు దొడ్ల అవసరం ఉందని హెడ్ మాస్టర్ కోరగా, వాటికి సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే పంపాలని కలెక్టర్ సూచించారు. అలాగే, పాఠశాలలో అత్యవసరంగా చేపట్టాల్సిన మరమ్మత్తు పనులను ముందుగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి, విజయకుమారి, శామీర్‌పేట మండల తహసీల్దార్ సుచరిత, పాఠశాల హెడ్ మాస్టర్,

# మొక్కజొన్నకు మద్దతు ఇస్తున్నాం

**కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి**



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎఎంసి చైర్మన్ చాపల శ్రీనివాస్

**వికారాబాద్, ప్రభాతవార్త :** మొక్క జొన్న కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్ తెలిపారు. శనివారం వికారాబాద్ డిసిఎంఎస్ కార్యాలయం ప్రాంగణంలో వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పర్యవేక్షణలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, తెలంగాణ శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం మార్క్ఫెడ్, డీసీఎంఎస్ వారి ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. క్వింటాలు మొక్క జొన్న మద్దతు ధర రూ. 2,400 నిర్ణయించినట్లు పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మొక్కజొన్న పంటను విక్రయించి లబ్దిపొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ మల్లేశం, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, కౌన్సిలర్ చిగుళ్లపల్లి రమేష్, డీసీఎంఎస్ మేనేజర్ సుదర్శన్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిపక్షాల వల్లే మహిళా బిల్లు వీగిపోయింది..

**వికారాబాద్, ప్రభాతవార్త :** మహిళలకు రాజకీయాలలో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలనే ఉద్దేశ్యంతో పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన మహిళా బిల్లును పాస్ కాకుండా ప్రతిపక్షాలు అడ్డుకున్నాయని బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు టి.శ్రీదేవి ఆరోపించారు. ఏబీ వాజపేయి ఉన్నప్పటి నుంచి రాజకీయాలలో మహిళలకు రిజర్వేషన్ కల్పించేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని తెలిపారు. అప్పుడు కూడా ప్రతిపక్షాలు అడ్డుకున్నాయని, ఇప్పుడు కూడా వారి వారసులు మళ్లీ అడ్డుకున్నారని ఆరోపించారు. సిఎం రేవంత్ రెడ్డి మహిళా బిల్లును అడ్డుకుని, జాతీయ విపత్తును అడ్డుకున్నామని పేర్కొనడం సిగ్గు చేటని పేర్కొన్నారు. ఎంఐఎం, కమ్యూనిస్టులు, బిఆర్ఎస్ పార్టీలకు తెలంగాణ మహిళా లోకం సరైన సమయంలో తగిన బుద్ధి చెబుతారని తెలిపారు. ఇప్పటికైనా ప్రతిపక్ష పార్టీలు మరోక్కసారి పునరాలోచన చేసి మహిళా బిల్లు పాస్ అయ్యేలా చూడాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## విపత్తు సమయంలో సురక్షితంగా చర్యలు

**షాద్‌నగర్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** వాస్తవ విపత్తు సమయంలో భయాందోళనలకు గురికాకుండా, సురక్షితంగా బయటపడటానికి సిద్ధం చేయడమే మాక్ డ్రిల్ కార్యక్రమమని సిఐఎస్ఎఫ్ అధికారులు తెలిపారు. షాద్‌నగర్ నియోజకవర్గం రాయికల్ ప్రాథమిక పాఠశాలలో.. సిఐఎస్ఎఫ్ ఇన్స్పెక్టర్ దిలీప్ సోనావానే మరి యు ఎస్ఐ వైబిబి రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు గ్యాస్ సిలిండర్ మరియు అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమంలో భాగంగా వారి సిబ్బందితో ఒక మార్క్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ శారద.. మరియు పాఠశాల సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# అన్నదాతల కష్టాలు పట్టవా?: సబితా ఇంద్రా రెడ్డి ధ్వజం

**ధారూర్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర రైతాంగం తీవ్ర ఆవేదన చెందుతోందని, మట్టిని నమ్ముకున్న రైతుకు భరోసా ఇవ్వడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి మండిపడ్డారు. శనివారం ధారూర్ మండలంలోని నాగుసన్ పల్లి, తరిగోపుల గ్రామాల్లోని మొక్కజొన్న పంటలను, అల్లీపూర్ గ్రామ పొలాల్లోని జొన్న కల్లాలను వికారాబాద్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్న ఆమె, ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. రైతుల సాగు కష్టాలను పరామర్శించిన అనంతరం ఆమె మాట్లాడుతూ, . క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు సకాలంలో



ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు దళారుల చేతుల్లో చిక్కి క్వింటాల్‌కు వేల రూపాయలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు అందాల్సిన రైతు భరోసా, పూర్తిస్థాయి రుణమాఫీ ఇప్పటికీ ప్రశ్నార్థకంగానే ఉన్నాయని, విత్తనాలు మరియు ఎరువుల సరఫరాలో కూడా ప్రభుత్వం విఫలమైందని ఆమె దుయ్యబట్టారు. ఒక్క ధారూర్ మండలంలోనే సుమారు 5 వేల ఎకరాల్లో పంట సిద్ధంగా ఉన్నా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడటం లేదని, పంట అంతా అమ్ముకున్నాక కొనుగోలు కేంద్రాలు తెరిస్తే ఎవరికి ప్రయోజనమని ఆమె ప్రశ్నించారు. తక్షణమే ప్రతి గింజను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ, ఇప్పటికే బీఆర్ఎస్ నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారని తెలిపారు. అనంతరం కలెక్టర్ దీపక్ తివారీ తో ఫోన్ లో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగేందర్ గౌడ్,బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు వేణుగోపాల్ రెడ్డి, హఫీజ్ ఖురేషి, సంతోష్ కుమార్, దేవేందర్, సీతాగారి లక్ష్మయ్య, నియోజకవర్గ పార్టీ ముఖ్య నాయకులు, మండల కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



## పేపర్ ప్లేట్స్ తయారీ దుకాణంలో అగ్నిప్రమాదం

**కుల్కచర్ల, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని పతంజలి ఆయుర్వేదిక్ దుకాణం పక్కన ఉన్న పేపర్ ప్లేట్స్ షాప్లో శనివారం రాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో పేపర్ ప్లేట్ యంత్రాలతో పాటు ముడిసరకు అగ్నికి ఆహుతైంది. వెంటనే పరిగి ఫైర్ స్టేషన్కి సమాచారాన్ని అందించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఉంటుందని భావిస్తున్నారు.

## క్రమశిక్షణతో కూడిన విద్య నేర్చుకోవాలి

**షాద్‌నగర్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని, కన్న తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని, పట్టుదలతో కృషి చేస్తే సాధించలేనిది అంటూ ఏదీ ఉండదని ఫరూక్ నగర్ మండల విద్యాధికారి మనోహర్ సూచించారు. పట్టణంలోని ఠాగూర్ హై స్కూల్ ఆడిటోరియం శనివారం సీబీఎస్ఈ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ మనోహర్‌తో పాటు పట్టణ సిఐ సీతారాం, ఎస్సై సుశీల ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఠాగూర్ హై స్కూల్ విద్యార్థులు సీబీఎస్ఈ ఫలితాల్లో 22 మంది విద్యార్థులు 90 పైగా మార్కులు సాధించడం పై వారు అభినందించారు. కష్టపడి చదివిన ప్రతి విద్యార్థి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోయిస్తారని ఆ దిశగా వారి ప్రయత్నం నిరంతరం కొనసాగాలని వారు సూచించారు. నేటి విద్యార్థులు రేపటి భావిభారత పౌరులని , ప్రతి ఒక్కరూ సమాజానికి తాము ఏం ఇస్తున్నామని ఆలోచించి ముందుకు సాగాలి అన్నారు. ఠాగూర్ హైస్కూల్లో విద్యార్థి సీబీఎస్సీ ఫలితాల్లోలో 98 శాతం మార్కులు సాధించడం షాద్నగర్‌కే గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో ఠాగూర్ హై స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ వంశి కేశవరం, ప్రిన్సిపల్ అంజలి, ఉపాధ్యాయులు నరేష్, సంతోష్, కుమార్, మాధవి లత, శ్రీనివాస్, పద్మావతి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థిని అభినందిస్తున్న ఎంఈఓ మనోహర్

## ఈ నెల 30న మహనీయుల జాతర

**చేవెళ్ల, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** ఈనెల 30న నిర్వహించ తలపెట్టిన మహనీయుల జాతర కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్, ప్రచార రథంను శనివారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రారంభించారు. మహనీయుల చరిత్రను భావితరాలకు తెలిపేందుకు చేపట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహనీయుల జాతర కమిటీ చైర్మన్ చైర్మన్ బురాన్ ప్రభాకర్, వైస్ చైర్మన్లు, వివిధ సంఘాల సభ్యులు ఉన్నారు.


మహనీయుల జాతర వాల్ పోస్టర్ ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

## తుర్కపల్లిలోని గురుకుల పాఠశాలలో అరైవ్-అలైవ్

**..వాహనదారులు రోడ్డు భద్రత నియామాల పాటించటానికి విద్యార్థులకు అవగాహన**
**..పేరెంట్స్ రోడ్డు భద్రతా నియామాలు పాటించాలి**
**..జీనోమ్‌వ్యాలీ పోలీస్ ఇన్స్‌పెక్టర్ జి.గురువయ్య**

**శామీర్‌పేట, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**
తుర్కపల్లిలోని మహాత్మా జ్యోతిబాపూలే బిసి గురుకుల పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత నియామాలపై వాహనదారులు (పేరెంట్స్) కు జీనోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్ సిఐ జి.గురువయ్య అవగాహన కల్పించారు. శనివారం శామీర్‌పేట మండలంలోని తుర్కపల్లి గ్రామ శివారులో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బిసి సంక్షేమ పాఠశాలలో అరైవ్-అలైవ్ కార్యక్రమాన్ని జీనోమ్‌వ్యాలీ పోలీసులు నిర్వహించారు. జీనోమ్‌వ్యాలీ పోలీస్ ఇన్స్‌పెక్టర్ గురువయ్య రోడ్డు భద్రత నియమాలు, హెల్మెట్, సీట్‌బెల్టు ప్రాముఖ్యత, మైనర్స్ డ్రైవింగ్ చేయటం వల్ల కలిగే ఇబ్బందులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు మీ పేరెంట్స్‌కు రోడ్డు భద్రత నియమాలను వివరించాలని సిఐ గురువయ్య సూచించారు. మైనర్స్ డ్రైవింగ్ చేస్తే జరిగే ప్రమాదాలు, పలు సంఘటనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ పాఠశాలలో సుమారు 250మంది విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. పోలీసులు నిర్వహిస్తున్న అరైవ్-అలైవ్ కార్యక్రమాన్ని రోజు వారీగ వివిధ ప్రాంతాల్లో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. తుర్కపల్లిలో జరిగిన కార్యక్రమంలో పోలీసులు, టీచర్లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


తుర్కపల్లిలోని మహాత్మా జ్యోతిబాపూలే బిసి సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన

## మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్‌తీరు గర్హనీయం

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** కేంద్రప్రభుత్వం మహిళా రిజర్వేషన్ల బిల్లు లోక్‌సభలో ప్రవేశపెట్టగా కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించి తీర్మానం వీగిపోయేలా చేయడం దారుణమని బిజెపి అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి అన్నారు. నారీ శక్తి వందన్ అధినియం (మహిళా రిజర్వేషన్ బిల్లు) లోక్‌సభలలో ఆమోదం పొందకుండా విపక్షాలు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ ఘట్‌కేసర్‌లో శనివారం బిజెపి నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఘట్‌కేసర్ డివిజన్ అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి రస్తారోకో చేశారు. కాంగ్రెస్‌పార్టీకి వ్యతిరేకంగా నాయకులు నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. దేశాన్ని దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ ఏనాడు మహిళా రిజర్వేషన్ బిల్లును పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసిందని, కేంద్రంలోని బిజెపి చట్టసభల్లో సముచిత స్థానం కల్పించేందుకు బిల్లు ప్రవేశపెట్టగా బిల్లుకు విపక్షాలు పూర్తి స్థాయిలో మద్దతు ఇవ్వకుండా రాజకీయ లబ్దికోసం డ్రామాలు ఆడటం మహిళల ప్రాతినిధ్యాన్ని వ్యతిరేకించడమేనని ఆయన పేర్కొన్నారు. మహిళలు చట్టసభల్లో అడుగుపెడితేనే దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందని బిజెపి విశ్వాసంతో ఉందని కానీ కాంగ్రెస్‌పార్టీ మాత్రం మహిళల ఎదుగుదలను అడ్డుకుంటూ అభివృద్ధికి విఘాతం కల్గిస్తుందని ఆయన విమర్శించారు. ఈకార్యక్రమంలో బిజెపి ప్రధాన కార్యదర్శులు చెల్లక శ్రీధర్, మంగు రాధిక, ఉపాధ్యక్షులు గుండ్ల రామతీర్థ, యువమోర్చ అధ్యక్షులు కొమ్మిడి విక్రాంత్‌రెడ్డి, మహిళా మోర్చ నాయకురాలు కొన్నె మాధవి, ఆకుల పద్మ, చంద్రకళ, పుష్ప, సిద్దిరాజు, మదుసూధన్‌రెడ్డి, రామకృష్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.


ఘట్‌కేసర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బిజెపి నాయకులు

## మానసిక వికలాంగురాలికి ఆర్థికసాయం

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ కుమ్మరిబస్తికి చెందిన మానసిక వికలాంగురాలికి సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థికసాయం చేశారు. కాలనీకి చెందిన దేవరకొండ పద్మకు 28 సంవత్సరాల మానసిక వికలాంగురాలైన కూతురు ఉండగా ఇటీవలలే భర్త చనిపోయారు. ఇంటి వద్ద మానసిక వికలాంగురాలైన కూతురును వదిలి పద్మ కూలి పనికి వెళ్ల లేని పరిస్థితి .వికలాంగ పింఛను రూ.4 వేలతో జీవనం గడుపుతున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండటంతో పద్మ సన్‌రైజజ్ ట్రస్ట్ సభ్యులు శ్రీకాంత్ ద్వారా ట్రస్టును ఆశ్రయించింది. ఈమేరకు శనివారం కుమ్మరిబస్తిలోని ఆమె ఇంటికి వెళ్లి ట్రస్టు ద్వారా రూ.20,000ల చెక్కును ట్రస్టు సభ్యులు అందజేశారు. ఈకార్యక్రమంలో యల్లంరాజు సుందరరావు, మోపర్తి శ్రీకాంత్, దేశబోయిన ఐలయ్య, ఆల్వా వీరారెడ్డి, నాగెల్లి రామయ్య, మక్కా మల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న సన్‌రైజ్ ట్రస్టు సభ్యులు

## అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి


ఘట్‌కేసర్‌లో అక్రమంగా ఏర్పాటు చేస్తున్న షెడ్డు

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో అధికారుల అలసత్వం కారణంగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. ఘట్‌కేసర్ డివిజన్ బాలాజీనగర్ సన్‌షైన్ పార్క్ పక్కన ఉన్న సర్వేనంబర్ 129లో నిబంధనలకు విరుద్ధంగా షెడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని వారు తెలిపారు .ఎలాంటి అనుమతులు లేకుండా కొండాపూర్ రోడ్డులో షెటర్లు నిర్మాణం చేస్తున్నారని, అక్రమ నిర్మాణాలపై పలుసార్లు అధికారులకు తెలియజేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కొందరు అధికారులు, సిబ్బంది అక్రమార్కులకు అండగా ఉంటూ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంఎంసి అధికారులు విచారణ జరిపి అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నా అక్రమ నిర్మాణాల పనులు నిలిపివేసే విధంగా ఆందోళన చేపడుతామని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## గ్లోబల్ మోడల్ స్కూల్‌లో ఘనంగా సైన్స్‌ఫెయిర్

**మోమిన్‌పేట్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** మోమిన్‌పేట్ మండల కేంద్రంలో స్థానిక గ్లోబల్ మోడల్ స్కూల్‌లో శనివారం ఘనంగా సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపల్ కిషోర్, సరితలు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన శాస్త్రీయ ప్రదర్శనలు సందర్శకులను అకట్టుకున్నాయి. ఈ సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు వివిధ విభాగాల్లో తమ ప్రతిభను చాటారు. పర్యావరణ పరిరక్షణ, పునరుత్పత్తి శక్తి వనరులు, రోబోటిక్స్, స్మార్ట్ సిటీల నిర్మాణం వంటి అంశాలపై మోడల్స్‌ను ప్రదర్శించారు. ముఖ్యంగా సౌరశక్తి ఆధారిత పరికరాలు, వర్షపు నీటి సంరక్షణ నమూనాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి హాజరైన తల్లిదండ్రులు, అతిథులు విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. శాస్త్రంపై ఆసక్తి పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ కిషోర్, సరితలు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడమే ఈ సైన్స్‌ఫెయిర్ ప్రధాన ఉద్దేశం. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమం చివర్లో భరతమాత ప్రదర్శనలు చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని ఈ సైన్స్‌ఫెయిర్‌ను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ మోడల్ స్కూల్ సిబ్బంది శివ, ప్రియ, కుమార్, సునీల్, అక్షిత, స్వప్న, తరుణ, విష్ణు ప్రియ, సావిత్రి, జ్యోత్స్న, మౌనిక, సౌమ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


సైన్స్‌ఫెయిర్ కార్యక్రమంలో మోడల్స్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

## ఎటిఎం డిపాజిటర్లను మోసగిస్తున్న వ్యక్తి అరెస్టు

**చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** ఏటీఎం డిపాజిటర్ల దృష్టి మరల్చి ఆర్థిక మోసాలకు పాల్పడుతున్న ఒక వ్యక్తిని చాంద్రాయణగుట్ట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి పదివేల రూపాయల నగదు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. శనివారం స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇన్‌స్పెక్టర్ ఆర్.గోపి, డీఐ రామస్వామితో కలిసి ఏసీపీ ఎ.సుధాకర్ వివరాలు వెల్లడించారు. రియాసత్‌నగర్, కంచన్‌బాగ్ నివాసి అబ్దుల్ నాసర్ (36) ఆర్టీఎ ఏజెంట్. ఈనెల 6వ తేదీ రాత్రి 10.15 గంటల ప్రాంతంలో చాంద్రాయణగుట్ట చౌరస్తాలోని యాక్సిస్ బ్యాంక్ ఏటీఎం ద్వారా పదివేల రూపాయలను డిపాజిట్ చేస్తున్నాడు. ఆ సమయంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి తన ఫోన్‌పే ద్వారా డబ్బు బదిలీ చేస్తానని చెప్పి నాసర్ వద్ద నుండి డబ్బును తీసుకున్నాడు. అనంతరం ఒక నకిలీ చెల్లింపు స్క్రీన్‌షాట్‌ను చూపించి అక్కడి నుండి పారిపోయాడు. ఆ తరువాత మోసపోయినట్లు గుర్తించిన అబ్దుల్ నాసర్ ఈనెల 7వ తేదీ ఉదయం 6గంటల ప్రాంతంలో చాంద్రాయణగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు 141/2026 యు/ఎస్ 303(2), 318(4) బిఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా ఈనెల 17వ తేదీ మధ్యాహ్నం 1:15 గంటల ప్రాంతంలో పోలీసులు అదే ఏటీఎం ప్రాంతంలో తలాబ్‌కట్టా అమన్‌నగర్ నివాసి, ప్రైవేటు ఉద్యోగి అబ్దుల్లా ఓబైద్ అల్ కతేరి ఎలియాస్ అబ్దుల్లా (25)ను అదుపులోకి తీసుకున్నారు. అతనిని విచారించగా నకిలీ ఫోన్‌పే అప్లికేషన్ ద్వారా తప్పుడు చెల్లింపుల స్క్రీన్‌షాట్లను చూపి మోసగిస్తున్నట్లు వెల్లడించారు. ఈ విధంగా అనేక నేరాలకు పాల్పడ్డట్లు అంగీకరించాడు. ఏటీఎంలలో డబ్బు డిపాజిట్ చేసే వారిని లక్ష్యంగా చేసుకొని నల్గురి నుండి రూ.46లు మోసం చేశాడు. పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఏసీపీ సుధాకర్ పర్యవేక్షణలో సీఐ గోపి, అదనపు సీఐ రామస్వామి, ఎస్సైలు జె.కిరణ్‌కుమార్, వి.శ్రీనివాసరావు, ఎస్.చంద్రారెడ్డి, సిబ్బంది నిందితుడుని పట్టుకోవటంలో చురుకైన పాత్ర పోషించారు.


సిఐ గోపితో కలిసి వివరాలు వెల్లడిస్తున్న ఎసిపి సుధాకర్



## రోడ్డుపై అక్రమ నిర్మాణాలు కూల్చివేత

**అత్తాపూర్ ఏప్రిల్ 18,ప్రభాతవార్త :** రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలపై జిహెచ్ఎంసి అధికారులు ఉక్కుపాదం మోపారు.శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్ నుండి శివరాంపల్లి వరకు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను డిసి సురేందర్ రెడ్డి ఆదేశాలతో టౌన్‌ప్లానింగ్ ఎసిపి శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు.ఈ సందర్భంగా టౌన్‌ప్లానింగ్ ఎసిపి శ్రీధర్ మాట్లాడుతూ.. పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ ప్రజల నుండి స్పందన రాకపోవడంతో కూల్చివేతలు చేపట్టినట్లు తెలిపారు.ఫుట్‌పాత్‌లను ఆక్రమించడం వల్ల ప్రజలు, ముఖ్యంగా పాదచారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు.అదేవిధంగా ట్రాఫిక్ సమస్యలు కూడా పెరుగుతున్నాయని పేర్కొన్నారు.నిబంధనలు ఉల్లఘించి ఎవరైనా ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు చేపడితే వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### అల్లరి మూకల ఆగడాలపై పోలీసులకు ఫిర్యాదు

**పేట్ బషీరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**
స్థానిక ప్రాంతంలో పెరుగుతున్న అల్లరి మూకల ఆగడాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు శనివారం పోలీసులను ఆశ్రయించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు కుంట సిద్ధిరాములు, ప్రధాన కార్యదర్శి తోకల నగేష్ రెడ్డి, చీఫ్ అడ్వైజర్ ఎర్రి భాస్కర్ రెడ్డి కలిసి పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో సీఐ హౌస్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాత్రివేళల్లో రోడ్డుపై మద్యం సేవించి అల్లరి చేసే వ్యక్తులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. బైకులను ధ్వంసం చేసి ఎత్తుకెళ్లడం, కార్ల అద్దాలను పగలగొట్టడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. సెలవుల సందర్భంలో గ్రామాలకు వెళ్లే ఇండ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.అలాగే ఎస్ఆర్ డిజి స్కూల్ గ్రౌండ్ పరిసరాల్లో ప్రతిరోజూ మద్యం ఖాళీ బాటిళ్లు కనిపిస్తున్నాయని, అక్కడ అల్లరి మూకల రాకపోకలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఆ ప్రాంతంలో ప్రత్యేకంగా పెట్రోలింగ్ పెంచి, సిబ్బందికి తగిన ఆదేశాలు జారీ చేయాలని సీఐను కోరారు.


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

### ఎస్సార్ నగర్‌లో పాన్ షాపులపై పోలీసుల తనిఖీలు..

**సంజీవరెడ్డి నగర్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** ఎస్సార్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు శనివారం పాన్ షాపులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇన్స్‌పెక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐలు రాజు రాథోడ్, సుదీర్ రెడ్డి, సిబ్బంది ఈ తనిఖీలు చేపట్టారు.తనిఖీలలో భాగంగా నిబంధనలు ఉల్లంఘించిన మూడు పాన్ షాపులను గుర్తించిన పోలీసులు, యజమానులపై కేసులు నమోదు చేశారు. కేసులు నమోదైన వారిలో అల్లాపూర్‌కు చెందిన ఇర్ఫాన్ ఆలమ్ (37), బాలానగర్‌కు చెందిన ఆషాల రాజు (42), సనత్ నగర్‌కు చెందిన మహ్మద్ జావేద్ (45)లపై కేసులు నమోదు చేశారు. వారి వద్ద నుండి సంబంధిత వస్తువులను స్వాధీనం చేసుకుని కేసులపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిబంధనలు పాటించని వ్యాపారాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.



## నల్లాకు అక్రమంగా బిగించిన మోటార్లు స్వాధీనం

**అత్తాపూర్ ఏప్రిల్18,ప్రభాతవార్త :** జలమండలి పైపులైనుకు నేరుగా విద్యుత్ మోటార్లు బిగించి నీటిని అక్రమంగా తోడుతున్న మోటార్లు సీజ్ చేసారు. శనివారం రాజేందర్ నగర్ జోన్ పరిధిలోని హైదర్ గూడ శివ నగర్ కాలనీ, ఉప్పర పల్లిలో విజిలెన్సు అధికారులు నీటి సరఫరా సమయంలో పర్యటించి పైపులైనుకు అక్రమంగా బిగించిన 12 మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా వినియోగదారులు ఇలా తమ నల్లాలకు మోటార్లు బిగించి పట్టుబడితే వారిపై జలమండలి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు మోటార్లు సీజ్ చేస్తారు. రెండోసారి మోటార్లు బిగిస్తే రూ.5 వేలు జరిమానా విధించి కేసులు నమోదు చేస్తారు. కాబట్టి వినియోగదారులెవరూ నల్లాకు మోటార్లు బిగించవద్దని జలమండలి అధికారులు హెచ్చరించారు.ఒకవేళ తక్కువ ప్రెజర్ తో నీరు సరఫరా అయినా.. లేదా నీటి సరఫరాలో ఏవైనా ఇతర సమస్యలు తలెత్తినా.. తమకు దగ్గర్లోని సంబంధిత మేనేజర్, డీజీఎం, జీఎం అధికారులను సంప్రదించాలి. లేదా జలమండలి కస్టమర్ కేర్ నంబరు 155313 కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. వాటిపై తప్పకుండా తగిన చర్యలు తీసుకుని సమస్యల్ని పరిష్కరిస్తామని తెలిపారు.

### రాంనగర్ గుండు వద్ద హోరెత్తిన నిరసన

## తేజస్వి సూర్య గో బ్యాక్

**చిక్కడపల్లి ఏప్రిల్ 18 (ప్రభాతవార్త ):** తెలంగాణ పట్ల బీజేపీ అవలంబిస్తున్న వ్యతిరేక వైఖరిని నిరసిస్తూ శనివారం రాంనగర్ గుండు వద్ద బీఆర్ఎస్ శ్రేణులు భారీ నిరసన కార్యక్రమం చేపట్టాయి. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య అనుసరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున గళమెత్తారు. ఈ సందర్భంగా నిరసనకారులు "బీజేపీ డౌన్ డౌన్", "తేజస్వి సూర్య డౌన్ డౌన్" అంటూ నినాదాలతో హోరెత్తించారు. మన హక్కుల సాధన కోసం, తెలంగాణ ప్రాంత అభివృద్ధి కోసం తమ పోరాటం ఆగదని, కేంద్రం వివక్షను ఎండగడతామని నాయకులు స్పష్టం చేశారు. "జై తెలంగాణ జై కేసీఆర్" నినాదాలతో రాంనగర్ పరిసర ప్రాంతాలు మారుమోగాయి. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు హరీష్, అస్లాం, రాజు, జ్ఞాని, పి. రాఘవ, శ్రీను, అన్వేష్, వెంకట్, నాగులు, ఏ.ఎస్.ఆర్, సురేందర్, టక్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ వైఖరికి బిజెపి నిరసన

**దుండిగల్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :**మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ శనివారం గండి మైసమ్మ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్వర చారి మాట్లాడుతూ భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజా స్వామ్య దేశమని, అయితే ఈ ప్రజాస్వామ్యంలో సగభా గమైన మహిళలకు చట్టసభల్లో సరైన ప్రాతినిధ్యం ఇప్ప టికీ దక్కలేదని పేర్కొన్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు దశకు చేరుకుం టున్న సమయంలో కాంగ్రెస్ పార్టీ అడ్డంకులు సృష్టించడం బాధాకరమని విమర్శించారు. స్వాతంత్రం తర్వాత దశాబ్దాల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీకి మహిళా రిజర్వేషన్లపై చిత్తశుద్ధి లేదని ఆయన ఆరోపించా రు. గతంలో యూపీఏ ప్రభుత్వ కాలంలో బిల్లును పూర్తి గా అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్, ఇప్పుడు అదే అంశంపై విమర్శలు చేయడం రాజకీయ ప్రయోజ నాల కోసమేనని అన్నారు.. పార్టీ మేనిఫెస్టోల్లో మహిళలకు రిజర్వే షన్లు వాగ్దానం చేసినప్పటికీ, ఆచరణలో అమలు చేయ లేదని పేర్కొన్నారు. మహిళలను ఓటు బ్యాంకుగా మాత్ర మే చూసిన కాంగ్రెస్ వైఖరిని ఖండిస్తూ, మహిళలు తమ హక్కుల కోసం చైతన్యంతో ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. దేశ భవిష్యత్తుకు హాని కలిగించే రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలు ఏకతాటిపై నిలవాలని ఆయన కోరా రు.



## విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను వెలికితీయడానికి వేదికలు అవసరం

**చిక్కడపల్లి ఏప్రిల్ 18 ( ప్రభాతవార్త ) :** మేనేజ్‌మెంట్ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, నాయకత్వ లక్షణాలను వెలికితీయడానికి ఇటువంటి వేదికలు దోహద పడతాయని రాష్ట్ర ఉన్నత విద్యామండలి పూర్వ చైర్మన్, డాక్టర్ అంబేడ్కర్ విద్యాసంస్థల సీఈఓ ప్రొఫెసర్ లింబా ద్రి అన్నారు. శనివారం బాగ్ లింగంపల్లి డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీలో మేనేజ్‌మెంట్ ఫెస్ట్ ఊర్జా 2కె26 ముగిసిం ది. అభ్యాసం, వినోదం, సాంస్కృతిక సమ్మేళనంతో సాగిన ఈ వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నా రు. ప్రొఫెసర్ డాక్టర్ లింబాద్రి, డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్ట ర్ శర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ బి. అంజన్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఫెస్ట్‌లో భాగంగా నిర్వహించిన ఈవెంట్లలో రెండో రోజు ఏర్పాటు చేసిన బైక్ ఎక్స్‌పో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులతో పాటు ఉస్మానియా విశ్వవిద్యాలయం నగ రంలోని వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు తరలివచ్చి ఫెస్ట్‌ను విజయవంతం చేశారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో వైవిధ్యభరితమైన పోటీలు నిర్వ హించారు. బిజినెస్ క్విజ్, మేనేజర్ హంట్, బ్రాండ్ మీమ్ వార్, ది బిగ్ యాడ్ థియరీ, షార్క్ ట్యాంక్, మేనేజ్‌మెంట్ గేమ్స్. ఫ్యాషన్ షో, టాలెంట్ హంట్, స్టాండ్‌అప్ కామెడీ, మూవీ టాకీస్, టగ్ ఆఫ్ వార్ వంటివి నిర్వహించారు. ముగింపు సందర్భంగా విజేతల కు బహుమతులు పంపిణీ చేశారు. అమీర్ లోగ్స్ సినిమా ప్రమోషన్, లైవ్ బ్యాండ్ ప్రదర్శనలు విద్యార్థులను ఉర్రూతలూగించాయి. అనంతరం నిర్వహించిన ఫ్లాష్ మాబ్, డీజే సెషన్‌తో ప్రాంగణమంతా కోలాహలంగా మారింది. విద్యార్థుల కేరింతలు, నృత్యాలతో ఊర్జా 2కె26 ఘనంగా ముగిసింది.


కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి పూర్వ చైర్మన్, డాక్టర్ అంబేడ్కర్ విద్యాసంస్థల సీఈఓ ప్రొఫెసర్ లింబాద్రి

## రెండు లక్షల ఉద్యోగాల పేరుతో కాంగ్రెస్ మోసం : ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్

**హైదరాబాద్,ఏప్రిల్ 18,ప్రభాతవార్త:** ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు హామీ ఇచ్చి మోసం చేసిందని నిరు ద్యోగల యువకులు, నిరుద్యోగ సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. తెలంగాణ జర్నలిస్టులు ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో " తెలంగాణలో ఉద్యోగాలు నిరుద్యోగ సమస్య" అనే అంశంపై సీనియర్ జర్నలిస్ట్ ఎ. రమణకుమార్, యార నవీన్ కుమార్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ..ఉద్యోగం వ్యక్తిగత అవసరమే కాదు వ్యవస్థ అవసరమని, విధాన నిర్ణయాలు తీసుకునేవాళ్లు ఈ కోణంలో ఆలోచిస్తే సానుకూల దృక్పథంతో నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తారు. ఈ ఆలోచన లేకపోవడంతో తెలంగాణలో నిరుద్యోగం బాగా పెరిగిపోయింది. దీనికి ప్రధాన బాధ్యత ప్రభుత్వాలదే. ప్రభుత్వం అందరికీ ఉద్యోగాలు ఇవ్వలేకపోవచ్చు. కానీ ఉపాధి కల్పించాలి. దురదృష్టవశాత్తు అధికారంలోకి వచ్చే ముందు నిరుద్యో గులకు చాలా హామీలు ఇచ్చింది. ఉద్యోగం రావాలంటే రేవంత్ పోవాలి. నిరుద్యోగానికి ఇదే పరిష్కారం అన్నారు. మొదటి ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేస్తామన్నారు. ఈ రెండున్నర సంవత్సర పాలనలో ఏ డిపార్ట్‌మెంట్‌లో ఎన్ని ఖాళీలు ఉన్నాయో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత 12 ఏళ్ల తర్వాత ఇంకా నిరుద్యోగం గురించి మాట్లాడుకుంటు న్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సీనియర్ జర్నలిస్టులు నవీన్,నర్ర విజయ్, ఆసరి రాజు, నిరుద్యోగ జేఏసీ నాయకులు భూక్యా కుమార్, సింధూరెడ్డి, ప్రత్యూష, కొడంగల్ రవి కుమార్ డీవైఎఫ్‌వై నాయకులు వెంకటేష్, పీవైఎల్ నా యకులు బీఎస్ కృష్ణ, బీఆర్ఎస్‌వీ నాయకులు తుంగ బాలు,ఐటీ స్కాలర్ రమావత్ మోహన్, ఇజాజ్, హరీశ్,పీడీఎస్‌యూ విద్యార్థి నేత మహేశ్ పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న దాసోజు శ్రావణ్ తదితరులు

### అద్భుతంగా సాగిన వీణావాద్య కచేరి

**చిక్కడపల్లి ఏప్రిల్ 18 ( ప్రభాతవార్త ) :** ప్రముఖ వీణా విదుషీమణి డాక్టర్ ఏ.ఎస్. మాధురి కుమార్ శనివారం అంబాత్రయ క్షేత్రం నిర్వహణలో గోమాత కళ్యాణమ హోత్సవంలో క్షేత్ర వ్యవస్థాపకులు డాక్టర్ ఆదిత్య పరాశ్రీ గురువు సమక్షంలో నిర్వహించిన కచేరి అందరిని సంగీత సాగరంలో తేలియాడించింది. ప్రధానంగా వాతాపి గణ పతిం, కంచి కామాక్షి వంటి భక్తి సంకీర్తనలు, అమ్మవారి మీద అద్భుతమైన స్వర జతి, అన్నమయ్య కీర్తన తిరు తిరు జవరాల, శక్తివంతమైన అయిగిరి నందిని స్తోత్రం, భక్తి పారవశ్యంలో ముంచెత్తే గోవింద నామాలు, త్యాగ రాజ కీర్తనలైన మరుగేలరా ఓ రాఘవ, గంధము పూయ రుగా వంటి కీర్తనలను అద్భుతంగా గానం చేసారు. ఈ ప్రదర్శనలకు సంగీత విమర్శకుల నుంచి విశేష ప్రశంసలు లభించాయి. కేవలం దేశీయంగానే కాకుండా, అంతర్జాతీయ వేదికలపై కూడా భారతీయ శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటుతూ ఆమె ముందుకు సాగుతున్నారు.


వీణ వాద్య కచేరి నిర్వహిస్తున్న ప్రముఖ వీణా విదుషీమణి డాక్టర్ ఏ.ఎస్. మాధురి కుమార్.

## తాగు నీటి సమస్య పరిష్కారం

**జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్, 18,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలం ధర్మతాండాలో తాగు నీటి సమస్యను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరిష్కరించినట్లు సర్పంచ్ చెందునాయక్ తెలిపారు. తాండాలో పదేళ్లగా నీటి కోసం గిరిజనులు అల్లాడుతున్నారని మిషన్ భగీరథ నీటి సరఫర రానిరోజుల్లో వ్యవసాయ పొలాల నుంచి తీసుకొచ్చి తాగుతున్నారని దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన వెంటనే స్పందించి వెంటనే బోరు మోటర్ పంపించి డ్రిల్లింగ్ చేయిస్తున్నట్లు తెలిపారు. శనివారం తండాలో బోరు మోటర్ డ్రిల్లింగ్ ను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చలివేంద్రం పల్లి రాజుతో పాటు సర్పంచ్ పనులను ప్రారంభించారు. నీటి ఎద్దడి తీర్చడంపై గిరిజనులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి దామోదర్ రెడ్డి బిసి సెల్ అధ్యక్షులు చంద్రశేఖర్, మహిళా అధ్యక్షురాలు రజిత, కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు కృష్ణ కిసాన్ సేల్ మండల అధ్యక్షులు నరసింహ రెడ్డి. ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రవి,ఎల్కు గూడ సర్పంచ్ బందయ్య కాస్లాబాద్ సర్పంచ్ కుమార్,సత్యం తుమ్మలపల్లి సర్పంచ్ రామచంద్రయ్య ,రాజు నాయక్ మాజీ సర్పంచులు పాలమూరు యాదయ్య, నర్సింలు ,బాలరాజ్ , మంగ నాయక్ , సయ్యాద్ హసన్, పాపయ్య ,రవి, మంగు రాజు , రెడ్యా, హనుమంతు, రాములు, శంకర్, గోవింద్, గోబరియా, చందర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


బోరు పనులకు పూజ చేస్తున్న సర్పంచ్ చందునాయక్

## వీరన్నపేటలో బోరు వేయించిన ఎమ్మెల్సీ

**జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్, 18,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని వీరన్నపేట గ్రామంలో శనివారం ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి సొంత నిధులతో బోరు వేయించారు. గ్రామంలో నీటిసమస్య తీవ్రంగా ఉందని సర్పంచ్ సుమలత వెంకట్‌రాములు ఎమ్మెల్సీ కి తెలుపడంతో వెంటనె స్పందించన ఎమ్మెల్సీ గ్రామంలో నూతన బోరుబావి తవ్వించారు. వేసిన బోరులో పుష్కలంగ నీరు వచ్చినట్లు సర్పంచ్ తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డికి సర్పంచ్, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


వీరన్నపేట గ్రామంలో బోరు వేయిస్తున్న నాయకులు

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**తలకొండపల్లి ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామానికి చెందిన నీరడి పెద్ద రాములు (65),శనివారంనాడు మృతి చెందాడు. అతని కుటుంబ సభ్యులను గ్రామ సర్పంచ్ వానరాశి రాములమ్మ ఉప సర్పంచ్ విజయలక్ష్మి ‍ ్మ విజయ్‌లు పరామర్శించారు. మృతి చెందిన అతని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, మాజీ ఎంపిపిసిఎల్ శ్రీనివాస్ యాదవ్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ నుంచి రూ.6వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వానరాశి రాములమ్మ, విజయలక్ష్మి ్మ విజయ్, టీఆర్ఎస్ నాయకులు వాన రాశి వెంకటేష్, గ్రామ కమిటీ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్ వార్డు సభ్యులు శ్రీరాములు బాలకృష్ణయ్య భాస్కర్ చీపిరి కృష్ణ పెంటయ్య కుమ్మరి కృష్ణయ్య మురళి కృష్ణ మల్లేష్ పాండు అశోక్ తదితరులు ఉన్నారు.



### ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం

**తలకొండపల్లి ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామంలో ఇంటర్మీడియట్ చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు గ్రామ సర్పంచ్ మల్లేష్ సన్మానం చేశారు. గ్రామానికి చెందిన నీలం భార్గవి 972,పబ్బతి వైశాలి 960, ఎన్నెడ్ల మనుశ్రీ 931,మార్కులు సాధిం చారు.వీరితో పాటు కాకి శ్రీకాంత్,గడిగే తేజశ్రీ,టి.గౌతం ఇంటర్మీడియట్ మొదటి ,రెండవ సంవత్సరం పూర్తిచేసిన విద్యార్థులకు గ్రామపంచాయతీ ఆవరణలో శాలువాతో ఘనసన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రులకు గ్రామానికి మండలానికి మంచిపేరు తేవాలని, భవిష్యత్తులో ఉత్తమపౌరులుగా ఉండేం దుకు విద్యనే అసలైన ఆయుధమంటూ ఆయన హితబోధ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మంజుల, గ్రామ కార్యదర్శి అనిత, వార్డు సభ్యులు లక్ష్మ ్మమ్మ రజిత మనోహర్ మీసాల మధు పవన్ నీలం కృష్ణయ్య, ఆశా కార్యకర్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.




## వెల్జాల్లో మొక్కజొన్న, వరి, కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**తలకొండపల్లి ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో శనివారంనాడు వరి ,మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. స్థానిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సింగల్ విండో వైస్ చైర్మన్, సింగల్ విండో వైస్ చైర్మన్ కూన మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఈ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల మేలు కోసం, మొక్కజొన్న వరి కొనుగోలు కేంద్రాల ద్వారా తమ ధాన్యాన్ని రైతులు మద్దతు ధరకు విక్రయించుకోవాలని వారు సూచించారు. సన్న వడ్లకు అదనంగా బోనస్ 500 రూపాయలు లభిస్తుందని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో వైస్ చైర్మన్ కూన రవి, ఆమనగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటరెడ్డి, టిఆర్ఎస్ నాయకులు వానరాశి వెంకటేష్ ,విజయ్ , మాజీ ఎంపిటిసి అంబాజీ సుధాకర్ రెడ్డి, అజీజ్ డి శేఖర్ శ్రీశైలం శ్రీరాములు నరేంద్ర గౌడ్ విజయ్ కుమార్ యూసఫ్ ఆరిఫ్ పెంటయ్య గౌడ్ రాజు ప్రకాష్ గౌడ్ భాస్కర్ విష్ణు దుబ్బ నరేష్ యాదగిరి దుబ్బ ఆరిఫ్ పెంటయ్య గౌడ్ రాజు ప్రకాష్ గౌడ్ భాస్కర్ విష్ణు దుబ్బ నరేష్ యాదగిరి దుబ్బ గణేష్ తదితరులున్నారు.



## మేధా స్కూల్ టాపర్ దీక్షితకు అభినందనల వెల్లువ

**అభినందించిన మాజీ వార్డు సభ్యుడు కృష్ణ**

**నందిగామ,ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** నందిగామ మండల కేంద్రానికి చెందిన బోర్ర ఆంజనేయులు కూతురు దీక్షి ‍ త సీ బీ ఎస్ సి పదవ తరగతిలో ప్రతిభ కనబరిచి స్కూల్ టాపర్ గా నిలిచింది. గ్రేడ్ పదిలో 97 శాతం మార్కులతో స్కూల్ టాపర్ నిలవడం పట్ల సరస్వతీ పుత్రిక దీక్షితను అభినందిస్తున్నారు. నందిగామకు చెందిన చిన్నారి దీక్షితను శనివారం ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ఎమ్మెల్సీ యువ సైన్యం అధ్యక్షుడు,మాజీ వార్డు సభ్యుడు తుప్పుడు కృష్ణ శాలువా వేసి సన్మానించి చిన్నారికి ఆశీస్సులు అందజేశారు.


స్కూల్ టాపర్ దీక్షితను సన్మానించిన మాజీ వార్డు సభ్యుడు తుప్పుడు కృష్ణ

## అనాధ వృద్ధురాలి అంత్యక్రియలు నిర్వహించిన గ్రామస్తులు

**మేడ్చల్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** ఎల్లంపేట మున్సిపల్ పరిధి నూతనకల్ గ్రామంలో మృతిచెందిన అనాద వృద్దురాలికి మున్సిపల్ కౌన్సిలర్లు అంత్రక్రియలు నిర్వహించారు. సుమారు 70 సంవత్సరాల వయస్సు గల అనాద వృద్దురాలు బాలమ్మ గత కొంతకాలంగా నూతనకల్ గ్రామంలో నివాస ముంటు న్నది. ఆమె అనారోగ్యం పాలై శనివారం మృతి చెందారు. ఆమె బంధువులు ఎవరూ ముందుకు రాకపోవడంతో నూతనకల్ గ్రామానికి చెందిన మున్సిపల్ కౌన్సిలర్లు సద్ది సురేష్ రెడ్డి, భాస్కర్, వేణు, నాయకులు యూనిస్ పాషా, జీవన్, భూషణం, మహేందర్ రెడ్డి, సురేష్ చారీ, పద్మారావు, హనీఫ్, జహంగీర్, గ్రామ స్తులు ముందుకు వచ్చి అంత్య క్రియలు జరిపారు.


అనాధ వృద్ధురాలికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న మున్సిపల్ కౌన్సిలర్లు

## టాలెంట్ సెర్చ్ టెస్ట్‌పై ఎస్‌సిఇఆర్‌టి ప్రశంసలు

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** యాలాల మండలంలో ఇటీవల విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్స్‌పై విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు వచ్చాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థుల్లో నైపుణ్యత వెలికి తీసేందుకు ఉపయోగపడే పరీక్ష మున్ముందు కూడా నిర్వహించాలని ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రమేష్ అభిప్రాయపడ్డారు. శనివారం యాలాల మండల విద్యాశాఖ అధికారి మహిపాల్‌రెడ్డి, రీసోర్స్ పర్సన్ మురహరినాథ్‌ను హైదరాబాద్ కార్యాలయంలో అభినందించారు. వినూత్నంగా నిర్వహించిన 5వ తరగతి టాలెంట్ సెర్చ్ పరీక్ష విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ పరీక్ష నిర్వహణకు కృషి చేసిన ఎంఈవో మహిపాల్‌రెడ్డి పలు అంశాలపై అడిగి తెలుసుకున్నారు. ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు చూపిన కృషి, విద్యార్థుల అభ్యాస ప్రగతి, ఆర్పీలు వినియోగిస్తున్న ఆధునిక సాంకేతిక పద్ధతుల గురించి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఐదో తరగతి విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికి తీసేలా నిర్వహించారని డైరెక్టర్ రమేష్ కొనియాడారు. విద్యార్థులు తరగతి సామర్థ్యాలను సంపూర్ణంగా సాధించేలా రూపొందించడం ఆదర్శ ప్రాయమని అన్నారు. ఈ టాలెంట్ సెర్చ్ పరీక్షను మండల స్థాయిలో నిరంతర ప్రక్రియగా మార్చి రాబోయే జూన్‌లో కూడా నిర్వహించాలని ఆయన సూచించారు.


ఎంఇఒ, ఆర్పీని అభినందిస్తున్న డైరెక్టర్ రమేష్.

## ప్రజాస్వామ్యాన్ని కాపాడే శక్తుల సత్తా చాటాం..

**షాద్‌నగర్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడం ప్రజాస్వామ్య చరిత్రలో కీలక ఘట్టంగా నిలిచిపోతుందని ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడం ప్రతిపక్షాల విజయమని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ ఖీవీర్లపల్లి శంకర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా మహిళా బిల్లును అడ్డుపెట్టుకొని డిలిమిటేషన్ బిల్ ప్రవేశపెట్టడం దుర్మార్గమైన చర్యను ప్రజాశక్తులు అడ్డుకున్నాయని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ప్రభుత్వ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే శంకర్ మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడే శక్తులు ఏకమైతే ఎలాంటి దురుద్దేశపు చట్టాలనైనా అడ్డుకోవచ్చని ఈ పరిణామం రుజువు చేసిందని పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందేమోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, గిరిజన రాష్ట్ర కోఆర్డినేటర్ పి రఘునాయక్, ఉమ్మడి మండలాల మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, కొత్తూరు పట్టణ పార్టీ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, లింగారెడ్డిగూడెం ఉపసర్పంచ్ ఏరోళ్ల అశోక్, మాజీ ఉపసర్పంచ్ సీతారాం, కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు ముబారక్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

## భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఇది చీకటి రోజు

**..బిజేపి కౌన్సిలర్ నాగారం మల్లేశం**

**తాండూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఏప్రిల్ 17 చీకటి రోజని తాండూరు పట్టణ బిజేపి కౌన్సిలర్లు నాగారం మల్లేశం, అంతారం కిరణ్, శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం తాండూరు మునిసిపల్ కార్యాలయం ముందు వారు నల్ల బ్యాడ్జిలతో నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్, ఐ.ఎన్.డి.ఐ.ఏ కూటమి మరోసారి తమ మహిళా వ్యతిరేక నైజాన్ని చాటుకుంటు, మహిళల పట్ల క్షమించరాని నమ్మకద్రోహానికి పాల్పడ్డాయని ఆందోళన వ్యక్తంచేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు వ్యతిరేకంగా ఓటువేసిన పార్టీలను, దేశ మహిళలు క్షమించకూడదని పిలుపునిచ్చారు.


నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలుపుతున్న బిజేపి కౌన్సిలర్లు

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- -నిర్దావెల్లి గ్రామ ఉపసర్పంచ్ సపూరా అమీర్
- -నిర్దవెల్లి పాఠశాలలో ప్రొ. జయశంకర్ బడి బాట కార్యక్రమం
- -ఘనంగా ఇంటింటి ప్రచారం ద్వారా విద్యార్థుల నమోదు పెంపుపై అవగాహన

**కేశంపేట, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని నిర్దా పెల్లి గ్రామ ఉపసర్పంచ్ సపురా అమీర్ అన్నారు . కేశంపేట మండల పరిధిలోని నిర్దవెల్లి ప్రభుత్వ పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమాన్ని శనివారం గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ అమీర్ ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల నమోదు పెంపు పై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.ప్రభుత్వ పాఠశాలలో అందుబాటులో ఉన్న ఉచిత విద్య, మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, యూనిఫామ్‌లు, టై, బెల్టులు, డిజిటల్ తరగతులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు వంటి సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి, పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ విద్య ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్రతి పిల్లవాడిని పాఠశాలలో చేర్పించడం మన అందరి బాధ్యత అని ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించడం ద్వారా ప్రభుత్వం ద్వారా విద్యార్థులకు అన్ని రకాల వసతులతో పాటు మెరుగైన విద్య అందించేందుకు అధ్యాపకులు ఉంటారని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ, వార్డు సభ్యులు నాగరాజు, చెన్నయ్య, చంద్రయ్య, రమేష్, రిజ్వానా బేగం, మోహిజ్, మంజుల, జంగేశ్, వెంకటమ్మ, మల్లయ్య, ఉపాధ్యాయులు గ్రామస్తులు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



నిర్దవెల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు,సర్పంచ్,ఉపసర్పంచ్

## పాడిగేదెల పథకం కోసం దరఖాస్తుల గడువు 23కు పొడిగింపు

**..జిల్లా ఎస్సీకార్పోరేషన్ ఇడి బాబు మోజెస్**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** పాడిగేదెల పథకం కోసం ధరఖాస్తులు చేసుకోవటానికి ఈ నెల 23వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించినట్లు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఎస్సీ కార్పోరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు (ఇడి) బాబు మోజెస్ తెలిపారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో ఎస్సి యాక్షన్ ప్లాన్ 2025-2026 అమలు చేస్తున్న పాడి గేదెల పథకానికి ధరఖాస్తులు చేసుకోవటానికి గడువును ఈ నెల 23వ తేదీ వరకు పొడిగించినట్లు ఆయన తెలిపారు. 10గుంటల వ్యవసాయ భూమి లేదా దాణా కొనగల షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులు అధికారిక పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో ధరఖాస్తులు చేసుకోవటానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఆ తరువాత ధరఖాస్తు ప్రతిని డౌన్‌లోడ్ చేసి అవసరమైన పత్రాలను జత చేసి సంబంధిత డిప్యూటీ కమిషనర్ లేదా మున్సిపల్ కమిషనర్ కార్యాలయాల్లో సమర్పించాలన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. అవసరమైతే మరిన్ని వివరాలకు జిల్లా ఎస్సీ కార్పోరేషన్ సంబంధిత అధికారులను సంప్రదించవచ్చు అన్నారు.


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు

## జనాభా గణన శిక్షణ

**దుద్యాల్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత ప్రభుత్వ జన గణన 2027 లో పాల్గొనే ఉద్యోగులకు 3 రోజులు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు అడిషనల్ చార్జ్ ఆఫీసర్ శివకుమార్ తెలిపారు. మొదటి విడతలో ఇళ్ల జాబితా, గృహాల లెక్కింపు చేసే ఎన్యూమరేటర్లు మరియు సూపర్వైజర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. శనివారం నాడు మొదటి రోజు శిక్షణ పూర్తి కాగా సోమవారం మంగళవారాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో ఎంఈవో శంకర్ తో పాటు మండలంలోని ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

### ఎంపి తేజస్వీ సూర్య వ్యాఖ్యలు క్షమార్హం కాదు

**షాద్‌నగర్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** తెలంగాణ తల్లి క్షోభించేలా, అమరులను అవమానించేలా బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వ్యాఖ్యలు చేశారని, కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో అజ్ఞానంతో వ్యవహరిస్తుందని షాద్ నగర్ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ మండిపడ్డారు. శనివారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే శంకర్ మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటును అవహేళన చేస్తూ మాట్లాడితే తేజస్విని బిజెపి తోటి ఎంపీలు మౌనంగా ఉంటూ ఏమనకపోవడం అనుమానాలకు తావిస్తుందని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా తేజస్వి మాట్లాడుతుంటే.. బీజేపీ రాష్ట్ర ఎంపీలు, కేంద్ర మంత్రులు చూస్తూ కూర్చోవడం దౌర్భాగ్యమని మండిపడ్డారు. అజ్ఞానులు, ధనబలం, మందబలంతో లోక్‌సభకు వచ్చిన బీజేపీ ఎంపీలకు వారి పార్టీ అయినా బుద్ధి నేర్పించాలని వ్యాఖ్యానించారు.

### రెండు తులాల బంగారం, నగదు చోరీ

**చౌడపూర్ ,ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** మండల కేంద్రానికి చెందిన చెనమోని నర్సమ్మకు చెందిన రెండు తులాల బంగారు గొలుసు , 14 వేల నగదు చోరీకి గురైందని కుల్కచర్ల పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఎస్ రమేష్ కుమార్ తెలిపారు.. శుక్రవారం రాత్రి నిద్రిస్తున్న సమయంలో ఇంట్లో చొరబడి గుర్తుతెలియని వ్యక్తులు నగదును,బంగారు గొలుసును దొంగలు ఎత్తుకెల్లారని ఫిర్యాదురాలు పేర్కొంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ రమేష్ తెలిపారు.

### యువతులకు అండగా కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్

**చేవెళ్ల, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** యువతుల వివాహానికి ప్రభుత్వం అందజేస్తున్న కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం వరం వంటిదని చేవెళ్ల ఎమ్మెల్యే కాల యాదయ్య అన్నారు. ప్రభుత్వం ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు శనివారం అందజేసి మాట్లాడారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న కుటుంబాలకు గౌరవప్రదమైన పెళ్లి కోసం ప్రభుత్వం అందించే సహాయం కళ్యాణ లక్ష్మి పథకమని, అర్హులైన ప్రతి ఒక్కరు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపాలిటీకి చెందిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 22 మంది లబ్ధిదారులకు రూ. 22,00,352 విలువైన చెక్కులను అందజేసినట్లు వివరించారు.




ఎండ తీవ్రతతో గొడుగు లేనిదే బయటికి వెళ్లలేని జనం.

## సుర్రు మంటున్న సూరీడు

**చిరు వ్యాపారులు విలవిల నిర్మానుష్యమైన రహదారులు**

**నందిగామ, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జనం బయటకు రావడానికి జంకుతున్నారు. పారిశ్రామిక ప్రాంతంగా,రియల్ ఎస్టేట్ పరంగా అభివృద్ధి చెందుతున్న నందిగామ మండలంలో ఇప్పటికే పరిశ్రమలు వదిలే జల, వాయు కాలుష్యంతో సతమతమవుతున్న జనానికి తోడు భగభగ మండే భానుడి సెగలతో ఒక్కరి బిక్కిరి అవుతున్నారు. వేసవికాలం ప్రారంభంలోనే భానుడు ప్రతాపం చూపడంతో ప్రజలు, దినసరి కూలీలు, చిరు వ్యాపారస్తులు విలవిలలాడుతున్నారు. గత వారం రోజుల నుండి ఉష్ణోగ్రతలు పెరగడంతో జనం బయటకు రావడానికి భయపడుతున్నారు. మరో ప్రక్క సమయపాలన లేకుండా అడపా దడపా కరెంటు కోతలతో ఫ్యాన్లు నడవక, కూలర్లు పని చేయక దోమల బాధతో కంటిమీద కునుకు లేకుండా రాత్రిళ్ళు నిద్రలేమికి గురవుతున్నామని విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రోజుల్లో ఎండ తీవ్రత ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండ తీవ్రత కాపాడుకోవడం కోసం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యునిపుణులు సూచిస్తున్నారు.


మక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్.

## మార్క్‌ఫెడ్ కేంద్రాల్లో మక్కలు కొనుగోలు

**మద్దతు ధర రూ.2400 : మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు**

తాండూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు మక్కలు విక్రయించాలని తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పీ. నర్సింహులు సూచించారు. శనివారం డిసిఎంఎస్ ఆవరణలో సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. తాండూరు ప్రాంతంలో వర్షాధారిత పంటలపైనే రైతులు ఆధారపడ్డారని గుర్తు చేశారు. ఖరీఫ్‌లో కంది, పెసర, మినుము పంటలతో పాటు యాసంగిలో వేరుశనగ, మొక్కజొన్నలు వేసుకుంటున్నారని తెలిపారు. ఈ పంటలకు గిట్టుబాటు ధరల కోసం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తాండూరు పరిసర ప్రాంతాల రైతులు డిసిఎంఎస్‌లో ఏర్పాటు చేసిన సెంటర్‌లో విక్రయించాలని సూచించారు. ప్రభుత్వం మొక్కజొన్న క్వింటాలుకు రూ. 2400 మద్దతు ధర నిర్ణయించిందని తెలిపారు. రైతులు మోసాలకు గురి కాకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నదని గుర్తు చేశారు. డిసిఎంఎస్ అధికారులు ఎల్లవేళలా రైతులకు సేవలు అందిస్తున్నారని చైర్మన్ అభినందించారు. కార్యక్రమంలో బషీరాబాద్, కోటపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్లు మాధవరెడ్డి, అంజయ్య, వైస్‌చైర్మన్లు సాయిని నారాయణరెడ్డి, చందర్, డైరెక్టర్లు ఉదయభాస్కర్‌రెడ్డి, జర్నప్ప, మున్సిపల్ వైస్‌చైర్మన్ అబ్దుల్ రజాక్, ఏజాజ్, డిసిఎంఎస్ మేనేజరు సలామ్, మాజిద్ తదితరులు పాల్గొన్నారు.

## ఈతకు వెళ్లి యువకుడు మృతి

**కుల్కచర్ల,ఏప్రిల్,18 ప్రభాతవార్త:** ఈతకు వెళ్లి యువకుడు మృతి చెందిన సంఘటన కుల్కచర్ల పోలీస్టేన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పరిగి మండల సైదుపల్లి గ్రామ పంచాయతీ హిరాపూర్ గ్రామానికి చెందినవీరపూరం రామస్వామి(26) శుక్ర వారం కుల్కచర్ల మండల పరిధిలోని ముజా హిద్‌పూర్ గ్రామ అక్కమ చెరువులోకి స్నేహితులతో కలిసి ఈతకోసం వచ్చి గల్లంతయాడు. గమనించిన స్నేహితులు గ్రామస్తులకు, పోలీసులకు సమాచాం ఇచ్చారు.వెంటనేపోలీసులు ఘటణ స్థలనికి చెరుకొని గిలింపు చర్యలు చేటాపరు.యువనికి అచూకి లభించకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు.గజ్జ ఇతగాలు గాలింపు చర్యలు చేపట్టగా గల్లంతైన రామస్వామి మృతదేహం చెరువులో లభ్యమైంది.ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ కుమార్ తెలిపారు.


ఈతకువెళ్లి మృతిచెందిన రామస్వామి మృతదేహం

## గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి

**చందనవెల్లి గ్రామ సర్పంచ్ చేవెళ్ల నవనీత స్వామి**

**షాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త :** గ్రామ ప్రజలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చందనవెల్లి గ్రామ సర్పంచ్ చేవెళ్ల నవనీత స్వామి అన్నారు. షాబాద్ మండల పరిధిలోని చందనవెల్లి గ్రామంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు పరిష్కరించేందుకు శనివారం బోర్ బావిని తవ్వించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ సమస్యలు పరిష్కరించేందుకు అందరి సహ కారంతో చర్యలు తీసుకుం టున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా పూర్తి చేసి, మండలంలో గ్రామా న్ని ఆదర్శవంతంగా తీర్చి దిదు తామన్నారు. ఈ కార్య క్రమంలో వార్డు సభ్యులు గీత, యాద య్య, గడిల కిష్టయ్య, గ్రామ స్తులు రామస్వామి, రాజ మల్లు, రాంచందర్, రాంరెడ్డి, యాది రెడ్డి, బేగరి రమేష్, బాలకృష్ణ, వడ్ల వెంకటేష్, బుద్ద శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


ఫోటో 01 చందనవెల్లి గ్రామంలో బోరుబావిని తవ్విస్తున్న గ్రామ సర్పంచ్ నవనీత స్వాములు

## చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**సర్పంచ్ మడుగు శ్రీనివాస్**

**కుల్కచర్ల,ఏప్రిల్,18 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామంలో సర్పంచ్ మడుగు శ్రీనివాస్ స్థానిక నాయకులతో చలివేంద్రాన్ని ప్రారంభిం చారు.ఈ సందర్భంగా సర్పంచ్ మడుగు శ్రీనివాస్ మాట్లాడుతూ..వేసవి నేపథ్యంలో బాటసారుల, ప్రయాణికులు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్య క్రమంలో పాంబండ ఆలయ చైర్మన్ కోట్ల హహిపాల్ రెడ్డి,ఉప సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి,పంచాయతీ కార్యదర్శి జాంగిర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


చలివేంద్రం ప్రారంభించిన సర్పంచ్

## నాయబ్ తహసిల్దార్ చంద్రశేఖర్‌కు టిడిపి సన్మానం

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ నాయబ్ తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన చెట్టి చంద్రశేఖర్‌ను టిడిపి నాయకులు సన్మానించారు. తహసీల్ కార్యాలయంలో శనివారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిసిన తెలుగుదేశం పార్టీ నాయకులు శాలువాతో సన్మానించారు. ఈకార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ అడహక్ కమిటీ సభ్యులు వేముల సంజీవగౌడ్, సుంకరి వెంకటేశ, శిష్టా సూర్యనారాయణ, సామల జగన్మోహన్‌రెడ్డిలు పాల్గొన్నారు.


నాయబ్ తహశీల్దార్ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

## సాకేత్ భూసత్వలో ఉచిత ఫిజియోథెరపీ శిబిరం

**మేడ్చల్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** ఆరోగ్యకరమైన జీవితంఫిజియోథెరపీతోనే సాధ్యమవుతుందని జన విజ్ఞాన వేదిక నాయకుడు ప్రసాదరావు అన్నారు. గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలోని సాకేత్ భూసత్వ క్లబ్ హౌస్‌లో మొబిలిటీ ఇండియా ఆధ్వర్యంలో ఉచిత ఫిజియోథెరపీ స్క్రీనింగ్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, వయసు పైబడటం వల్ల నడకలో సమతుల్యత కోల్పోయే వయోవృద్ధులకు ఇలాంటి శిబిరాలు ఎంతో ఉపయోగపడుతాయని అన్నారు. వైద్యులు చెప్పిన ఆరోగ్య సూత్రాలు పాటించి మెరుగైన జీవనం సాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సమరాజ్ రెడ్డి, డాక్టర్ సౌమ్యశ్రీ, రిటైర్డ్ డిఎస్పి రామారావు, బిఎస్ఎన్ఎల్ విశ్రాంత ఇంజనీర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఫిజియో థెరపీ చేయిస్తున్న ఫిజియోథెరపిస్టులు

## బిజెపి నాయకుల నిరసన

**మేడ్చల్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** పార్లమెంటులో మహిళా బిల్లును వ్యతిరేకంగా తీర్మానం చేసిన కాంగ్రెస్ పార్టీ వైఖరికి నిరసనగా మేడ్చల్ పట్టణంలో బీజేపీ నాయకులు నల్ల బ్యాడ్జీలతో ర్యాలీ నిర్వహించారు. ఈ దేశంలో మహిళలను చట్టసభల్లో రానీయకుండా కాంగ్రెస్ పార్టీ అడ్డుపడిందని ఈ సందర్భంగా మహిళా నాయకులు ఆరోపించారు. మహిళలకుకాంగ్రెస్ చేసిన అన్యాయానికి తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎల్లంపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మేకల రజిత దేవేందర్ రెడ్డి, బీజేపీ మేడ్చల్ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్, ఎల్లంపేట మున్సిపల్ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, ఎల్లంపేట మున్సిపల్ కౌన్సిలర్ మహేశ్వరి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు గౌరవరం జగన్ గౌడ్, సముద్రాల హంస కృష్ణగౌడ్, కార్యదర్శి నరేందర్ రెడ్డి, జిల్లా కో ఆర్డినేటర్ లవంగ శ్రీకాంత్, నాయకులు కృష్ణ గౌడ్, మేడ్చల్ ప్రధాన కార్యదర్శి ప్రేమ్ దాస్, మహేష్, నాయకులు వంశీధర్ రెడ్డి, మైసరి రాజు, చేరుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, వాచుపల్లి శ్రీనివాస్ ,రాజేష్ ,రాజు నాయక్, మల్లేష్ యాదవ్, సత్యనారాయణ రెడ్డి, పోచయ్య, పుష్ప మల్లారెడ్డి, అంకిత, అనిత, సాయి కుమార్, వెంకటేష్, రవి నాయక్, నాగేందర్‌రెడ్డి, చంద్రం, లక్ష్మణ్ పాల్గొన్నారు.



మేడ్చల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బిజెపి నాయకులు

## కడ్తాల్ తైబజార్ వేలం ద్వారా రూ. 8,50,200 ఆదాయం

**కడ్తాల్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** కడ్తాల్ గ్రామపంచాయతీకి సంబంధించి టై బజార్ ద్వారా 8,50,200/ ఆదాయం లభించిందని ఎంపీ ఓ లాలయ్య తెలిపారు. తైబజార్‌కు సంబంధించి తుది ఉత్తర్వులు జిల్లా పంచాయతీ అధికారి రంగారెడ్డి జిల్లా నుండి రావడం జరిగిందని పేర్కొన్నారు. .2026-27 ఆర్థిక సంవత్సరానికి (ఎనిమిది లక్షల యాభై వేల రెండు వందల రూపాయలు) కనీస మద్దతు ధర ఇవ్వడమైనది. అందరి కంటే అధికంగా వేలం వేసిన జి.రామచంద్రయ్యకు తైబజార్ వసూలు చేయుటకు ఆదేశించడం అయినదని ఎంపి ఓ, లాలయ్య, తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాయికంటి బిక్షపతి, ఉపసర్పంచ్ యాదగిరి రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అల్లాజి, గ్రామ పంచాయతీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## టిఎన్‌జిఒ నూతన కార్యవర్గం ఎన్నిక

**చేవెళ్ల, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్ల



టీఎన్ జీఓ నూతన కార్యవర్గం

సంఘం చేవెళ్ల తాలూకా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శనివారం చేవెళ్ల మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్తు సమావేశ మందిరంలో తాలూకా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా పాలుబాయ్ ఈశ్వర్ వ్యవహరించారు.నూతన కార్యవర్గం ఇదే..చేవెళ్ల తాలూకా నూతన అధ్యక్షులుగా జె.శివకుమార్ (పంచాయతీ కార్యదర్శి, అలూరు), ఉపాధ్యక్షులుగా జ్యోతి (హాస్టల్ వార్డెన్, షాబాద్), కార్యదర్శిగా డి. శ్యామ్ రావు (జూ. అసిస్టెంట్. షాబాద్), సంయుక్త కార్యదర్శి మహిళా విభాగంగా వాసవి రెడ్డి (పంచాయతీ కార్యదర్శి, ఈర్లపల్లి), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జి. మహేందర్ (మార్కెటింగ్ కార్యదర్శి), కోశాధికారిగా ఆనంద్ సింగ్ (జూ.అ., ఎస్టీఓ చేవెళ్ల), ప్రచార కార్యదర్శిగా బి. సంగారెడ్డి (పంచాయతీ కార్యదర్శి గొల్లపల్లి), కార్యవర్గ సభ్యులుగా కె. నర్సింహులు (మిషన్ భగీరథ లైన్ మెన్), మహిళా విభాగం కార్యవర్గ సభ్యులుగా వినోద (సీనియర్ అసిస్టెంట్, ఆలూరు) లు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి పాలుబాయ్ ఈశ్వర్ ప్రకటించారు. ఈ సందర్భంగా చేవెళ్ల తాలూకా నూతన అధ్యక్షులుగా ఎన్నికైన జె. శివకుమార్ మాట్లాడుతూ.. వరుసగా రెండో సారి అధ్యక్షునిగా ఎన్నుకున్నందున తనపై మరింత బాధ్యత పెరిగిందని చెప్పారు. ఉద్యోగుల సంక్షేమమే ఎజెండాగా పని చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హిమబిందు, టీఎన్ జీఓ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు గ్యాస్ కొరత లేకుండా చూడాలి




జిల్లా ఎసిఒ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న అయా గ్రామాల సర్పంచులు

**కుల్కచర్ల,ఏప్రిల్,18 ప్రభాతవార్త :** ప్రజలకు గ్యాస్ సిలిండర్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని,అవసరం ఉన్నప్రతి వినియోగదారుడికి సమయానికి సిలిండర్లు అందేలా చర్యలతీసుకోవాలని కుల్కచర్ల సర్పంచులు జిల్లా ఎసిఒ అధికారికి వినతి పత్రంఅందజేశారు.శనివారం మండల కేంద్రంలోని భారత్ గ్యాస్ ఏజెన్సి కార్యాలయంలో ఏజెన్సి నిర్వాహకులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అయా గ్రామా సర్పంచులు మాట్లాడుతూ...ప్రజలకు గ్యాస్ కొరత లేకుడా గ్రామాల్లో సరఫరా చేయాలని సూచించారు.ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజి అధ్యక్షులు సారా శ్రీనివాస్, సర్పంచులు రవిందర్ నాయక్, రాజు నాయక్,సితారాం నాయక్, సంతోష్ నాయక్, మాజి సర్పంచ్ శంకర్ నాయక్, కండక్టర్ చంద్రయ్య,రఘు తదితరులు పాల్గొన్నారు.

# యంనంపేట్ రంగనాథ స్వామి ఆలయ వార్షికోత్సవాలు



యంనంపేట్ శ్రీ రంగనాథ స్వామి ఆలయ గాలి గోపుర దృశ్యం.

**ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 18, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ యంనంపేట్‌లోని రంగనాథ స్వామి దేవాలయ 18 వ వార్షిక బ్రహోత్సవాలు ఈ నెల 27 వ తేది నుండి మే 1 వ తేది వరకు జరుగుతాయని ఆలయ ఈవో లగడపాటి భాగ్యలక్ష్మి తెలిపారు. స్వామి వారి బ్రహోత్సవ వేడుకల్లో భాగంగా ఈ నెల 27వ తేదిన విష్ణు సహస్ర నామ స్తోత్రపారాయణం, విష్వక్సేన ఆరాధన వాసుదేవ పుణ్యహావాచనం, రక్షాబంధనం తదితర పూజలుంటాయని తెలిపారు. 28వ తేదిన ధ్వజారోహణ పూజలు, 29వ తేదిన పూర్ణాహుతి, నిత్యారాధన, బలిపీఠ ప్రతిష్ట మహోత్సవం, గోదా రంగనాథ స్వామి సహిత భూనీలా సమేత వేంకటేశ్వరస్వామి వార్ల తిరుకల్యాణ మహోత్సవం, తీర్థప్రసాద వితరణ, 30వ తేదిన సుదర్శన లక్ష్మీనరసింహ హవనం, పుష్పయాగం, ధ్వజా అవరోహణ తదితర పూజలుంటాయని తెలిపారు. మే మాసం 1 వతేదిన విశేష పంచామృత అభిషేకం, మహదాశీర్వచనం, స్వామివారి తిరువీధి ఉత్సవ ఉరేగింపు ఉంటుందని తెలిపారు. స్వామి వారి వార్షిక కల్యాణోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆలయ ఈవో ఎల్. భాగ్యలక్ష్మీ తెలిపారు.

# మహిళల హక్కులను అడ్డుకున్న కాంగ్రెస్

**కేశంపేట, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :**

పార్లమెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తీసుకొచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఓటు వేయడాన్ని రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు కంచుకోట మహేష్ తప్పు పట్టారు. శనివారం ఆయన మీతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యంగా రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ మహిళా రిజర్వేషన్ బిల్లుకు వ్యతిరేకంగా వ్యవహరించడం దేశ మహిళలకు అన్యాయం అని అన్నారు. మహిళలకు 33 శాతం రాజకీయ అవకాశాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లును వ్యతిరేకించడం కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొదటి నుంచి మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. దక్షి ణ భారతంపై ప్రాంతీయ భావజాలాన్ని రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించిన పార్టీలకు మహిళలు రాజకీయంగా తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మహిళలకు విస్తృత అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ముందుకు తెచ్చిన బిల్లును కాంగ్రెస్ అడ్డుకోవడం బాధాకరమని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన అంశాన్ని కారణంగా చూపుతూ మహిళలు, ఎస్సీ, ఎస్టీ, యువతకు రాజకీయ అవకాశాలు రాకుండా అడ్డుకోవడం కాంగ్రెస్ అసలు స్వభావాన్ని బయటపెడుతుందని ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం పై మండిపడ్డారు.



జిల్లా కౌన్సిల్ సభ్యులు కంచుకోట మహేష్

# డయాలిసిస్ సేవలను బలోపేతం చేసేందుకు చర్యలు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** జిల్లాలో డయాలిసిస్ సేవలను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవటానికి, ప్రతి రోగికి సమీపంలోనే నాణ్యమైన సురక్షితమైన వైద్య సేవలు అందించటానికి వైద్యాధికారుల బృందం క్షేత్రస్థాయిలో శనివారం పర్యటించి తనిఖీలు నిర్వహించింది. మేడ్చల్ జిల్లాలో ఉన్న సిహెచ్‌సి కేంద్రాల్లో డయాలసిస్ కేంద్రాలను, కొత్తగా డయాలిసిస్ కేంద్రాలు ఉన్న కేంద్రాల్లో అదనపు పడకల ఏర్పాటుపై జిల్లా వైద్య అధికారుల బృందం, డిఎంఅండ్‌హెచ్ డాక్టర్ సి.ఉమాగౌరి వారితో కలిసి స్థల స్థాయి తనిఖీలు నిర్వహించారు. శనివారం మేడ్చల్ జిల్లాలోని సిహెచ్‌సి సెంటర్లు ఘట్‌కేసర్, శామీర్‌పేట కేంద్రాలను వైద్యాధికారుల బృందం, డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సి.ఉమాగౌరి పర్యటించి స్థల తనిఖీలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజా ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా ప్రతిపాదిత డయాలసిసస్ కేంద్రాలు, ఇప్పటికే ఉన్న కేంద్రాలలో అదనపు పడకల వివరాలు జిల్లాల వారీగ అందించటంతో దీనిలో భాగంగా మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో కొత్త డయాలిసిస్ కేంద్రాల్లో, ఉన్న కేంద్రాల్లో అదనపు పడకల ఏర్పాటు కోసం వారు తనిఖీలు చేశారు. పై అధికారుల ఆదేశాల మేరకు మేడ్చల్ జిల్లాడిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సి.ఉమాగౌరి,జిల్లా హాస్పిటల్ సర్వీసెస్ కోఆర్డినేటర్ డాక్టర్ సునీత, సూపరిండెంట్ ప్రభుత్వ ఆసుపత్రి కుత్బుల్లాపూర్ డాక్టర్ రాధ లు సిహెచ్‌సి ఘట్‌కేసర్, శామీర్‌పేట కేంద్రాలనను వారు సందర్శించి పరిశీలించి తనిఖీలు నిర్వహించారు. అత్యవసర,సాంకేతిక సదుపాయాల కింద ఆక్సిజన్ వంటి ఎమర్జెన్సీ పరికరాలు ల్యాబోరేటరీ, టీ డయాగ్నస్టిక్స్ సౌకర్యాలు, త్రాగునీరు, నీటి కనెక్షన్ నిరంతర విద్యుత్ సరఫరా, ఐటి టెలి మానిటరింగ్ కోసం ఇంటర్నెట్ కనెక్షన్ అందుబాటులో ఉన్నాయా అనే అంశాలను వారు పరిశీలించారు. అదనంగా కేంద్రాలు తక్షణ సేవలు ప్రారంభానికి సిద్దంగా ఉన్నాయా, అవసరమైన మానవ వనరుల వర్క్స్ నియామకానికి పట్టే సమయం, సివిల్ వర్క్స్ అవసరాలు, ప్రస్తుత స్థితి, పనులు పూర్తి చేయటానికి అవసరమైన కాలపరిమితి వంటి అంశాలపై అంఛనా వేశారు. తనిఖీల అనంతరం సంబంధిత నివేధికలను నిర్దేశిత నమూనాలో సిద్దం చేసి పై అధికారులకు సమర్పించటం జరుగుతుందన్నారు.



జిల్లాలోని సిహెచ్‌సి కేంద్రాలను సందర్శించిన వైద్య అధికారుల బృందం, డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సి.ఉమాగౌరి తదితరుల దృశ్యం

## మూసీపునరుజ్జీవన ఉపసంఘానికి ఎంపిఎస్ వినతి

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** మూసీ పునరుజ్జీవనంపై ఏర్పాటు చేసిన మంత్రి మండలి ఉప సంఘానికి మూసీ పరిరక్షణ సమితి వినతిపత్రం అందజేసింది. ఈమేరకు మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపై మూసీనది పరివాహక గ్రామాల ప్రజల అభిప్రాయాలు సేకరించాలని కోరుతూ మూసీ పరిరక్షణ సమితి, మూసీ పరివాహక గ్రామాల సమూఖ్య ఆధ్వర్యంలో మంత్రుల కమిటీకి ఆన్‌లైన్‌లో వినతిపత్రం పంపినట్లు మూసి పరిరక్షణ సమితి అధ్యక్షులు బట్టె శంకర్ తెలిపారు. మూసీ పునరుద్ధరణ కమిటీ అధ్యక్షులు-ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, ఇంధనశాఖ మంత్రి భట్టి విక్రమార్క, కమిటీ సభ్యులు-ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య, శాసనసభ వ్యవహారాలమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కమిటీ సభ్యులు-రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు మూసీ పరిరక్షణ సమితి అధ్యక్షులు బట్టె శంకర్, గౌడ సంఘాల సమాఖ్య అధ్యక్షులు బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్, యాదవ సంఘాల అధ్యక్షులు చిలువేరి ఐలయ్య, శాలివాహన సంఘాల అధ్యక్షులు గుండోళ్ల లింగస్వామి, ముదిరాజ్ సంఘాల అధ్యక్షులు పూలమోని బస్వయ్య, దళిత సంఘాల నేత సిరిపని ఐలయ్య, నాయిబ్రహ్మణ సంఘాల అధ్యక్షులు మల్యాల బాలయ్యల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని సబ్‌కమిటీకి పంపించారు. మూసి పరివాహక గ్రామాల ప్రజల కష్టాలు తీర్చేవిధంగా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. 3 జిల్లాలలో 20 మండలాల పరిధిలో వంద గ్రామాలలో మూసీ నీరు ప్రవహిస్తుందని, పారిశ్రామిక వ్యర్థ రసాయనాలు, హైదరాబాద్ నగర డ్రైనేజీతో గత 3 దశాబ్దాలుగా మూసీ నీరు విషపూరితం కావడం వల్ల స్థానికుల బతుకులు విధ్వంసమై తీవ్ర ప్రభావం చూపిందని తెలిపారు. పశువులు, గొర్రెలు, మత్స్య సంపద, పంటపొలాలు, తాటి, ఈత చెట్లు మూసీ జలాల కాలుష్యంతో అనారోగ్యకరమైన పరిస్థితి ఏర్పడిందన్నారు. స్త్రీలకు గర్భవిచ్చిన్నం, పశువులు, గొర్రెలు, మేకల సంతాన ఉత్పత్తిపై ప్రభావం, చెరువుల్లో చేపల మృత్యువాత, పొలాలలో పనిచేసే వారికి చర్మవ్యాదులు, కల్లు, కూరగాయల, వరిపంట ఉత్పత్తిలో 40 శాతం తాలు వచ్చి తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. మూసీ ప్రాజెక్టుంపై అభిప్రాయాలు సేకరించే కమిటీ మూసీ పరివాహక గ్రామాల్లో పర్యటించాలని, గౌరెల్లి గ్రామం వరకే ప్రకటించిన ప్రాజెక్టును సూర్యాపేట జిల్లా కేతేపల్లి మండలం సోలిపేట గ్రామం వద్ద మూసినదిపై నిర్మించిన మూసీ ప్రాజెక్టు వరకు పొడగించాలని కోరారు. మూసీ పునరుద్దరణ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేస్తున్నందున మూసీ దిగువన ఉన్న 70 గ్రామాలకు వెయ్యి కోట్ల రుపాయలు కేటాయించాలని కోరారు. అన్ని గ్రామాల్లో ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేసి నిర్వహణను గ్రామపంచాయతీలకు అప్పగించాలని, పురాతన చెరువులు, సాగునీటి కాలువలు, కత్వాలను పూడికతీసి మరమ్మత్తులు చేసి అభివృద్ధి పరచాలని తెలిపారు. ఎదులాబాద్ లక్ష్మినారాయణ చెరువులో 2 టిఎంసిల నీరు నిల్వ ఉంటుందని, చెరువును ప్రక్షాళన చేసి పూర్వవైభవం తీసుకురావాలని, మత్స్యకారులకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని కోరారు. మండల స్థాయిలో ఆరోగ్య కేంద్రాలు సరిపోవడం లేదని నాలుగైదు గ్రామాల క్లస్టర్లకు ఒక ఆరోగ్య కేంద్రం ఏర్పరచాలని అందులో తప్పనిసరిగా మహిళా, శిశువు, వైద్యబృందం, చర్మవైద్యుడు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని మూసీ పీడిత ప్రజల సమస్యలు పరిష్కరించి వారి జీవన స్థితిగతులను మెరుగు పరచాలని సబ్‌కమిటీకి విజ్ఞప్తి చేసినట్లు ఎంపిఎస్ అధ్యక్షులు బట్టె శంకర్ తెలిపారు.

## చిన్నపిల్లల్లో మెదడు అభివృద్ధిపై అవగాహన

### ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ

**మోమిన్‌పేట్, ఏప్రిల్ 18. ప్రభాతవార్త:** చిన్నపిల్లలో భాషా నైపుణ్యాలు మెరుగు పర్చలంటే వారికి రక రకాల బొమ్మల చిత్రాలను, మరియు చిన్నచిన్న కథలను ఉపయోగించి పిల్లలు మనం మాట్లాడితే మళ్లీ తిరిగి మాట్లాడేలా ప్రోత్సహించేలా అంగన్వాడీ టీచర్లకు తెలియజేశారు. శనివారం మోమిన్‌పేట్ మండల పరిధిలోని దుర్గంచెర్వు గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో పిల్లల భాషా నైపుణ్యాల గురించి ఈ అవగాహన కార్యక్రమం రిర్వహించడం జరిగిందని జయశ్రీ తెలిపారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతు ముఖ్యంగా పిల్లల తల్లితండ్రులు కూడా పిల్లలతో వారికి అర్ధమయ్యే విధంగా మాట్టాడుతు వారికి అవగాహన కల్పిస్తు పిల్లల్లో మెదడు అభివృద్ధిపై అవగాహన కలగడానికి అవసరమైన కలగడానికి అవసరమైన ఆటలు, మరియు పాటలు, కథలు చెబుతూ వారి నైపుణ్యాలను పెంపొందించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లావణ్య మోహన్, పంచాయతి కార్యధర్శి సుప్రియ, వార్డు సభ్యులు , అంగన్వాడీ టీచర్లు రాములమ్మ, లక్ష్మి, అన సూజ, పిల్లలు, వారి తల్లి తండ్రులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న గర్భిణీ స్త్రీలు, పిల్లలు బాలింతలకు, పిల్లలు, అంగన్‌వాడీ టీచర్లు.



పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీ టీచర్లు

## పిల్లల బంగారు భవిష్యత్తుకు' పోషణ పక్వాడ' పునాది

**దౌల్తాబాద్,ఏప్రిల్ 18,ప్రభాతవార్త:** చిన్నారుల ఆరోగ్యకరమైన పెరుగుదల కేవలం ఆహారంతోనే కాకుండా,సరైన ఆట పాటలు,తల్లిదండ్రుల ప్రేమతోనే సాధ్యమవుతుందని అంగన్‌వాడీ టీచర్లు పేర్కొన్నారు.శనివారం దౌల్తాబాద్ మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో 'ఫోషణ పక్వాడ'(పోషకాహార పక్షోత్సవాలు) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సంధర్భంగా 0-6 ఏళ్లలోపు పిల్లల శారీరక,మానసిక అభి వృద్ధిపై తల్లిదండ్రులకు విస్తృత అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు అనురాధ,అనిత స్థానిక వస్తువులతో బొమ్మ లను తయారు చేసే డీఐవీ టాయ్ మేకింగ్ విధానాన్ని ప్రదర్శిం చారు.ఖర్చు లేకుండా ఇంట్లోనే దొరికే వస్తువులతో బొమ్మలు తయారు చేయడం వల్ల పిల్లల్లో సృజనాత్మకత పెరుగుతుందని వివరించారు.

అంగన్‌వాడీ కేంద్రాలను భోజన కేంద్రాలుగా కాకుండా,ఆటల ద్వారా నేర్చుకునే కేంద్రాలుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని వారు తెలిపారు.పిల్లల పెంపకంలో కేవలం తల్లులదే కాకుండా,తండ్రుల పాత్ర కూడా ఎంతో ప్రత్యేక సమావేశంలో చర్చించారు.

## జనగణన విధులు పక్కాగా నిర్వహించాలి

### తహశీల్దార్ శ్రీనివాస్

**కోట్‌పల్లి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త;** జనగణన కార్యక్రమాన్ని ఖచ్చితంగా, పారదర్శకంగా నిర్వహించాలని కోట్‌పల్లి తహశీల్దార్ శ్రీనివాస్ అన్నారు. శనివారం నాడు వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అవరణలో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసంద ర్భంగా వారు మాట్లాడుతూ. ఎన్యుమరేటర్లు ప్రతి గృహన్ని సమగ్రంగా కవర్ చేస్తూ, పూర్తి వివరాలను సరైన విధంగా నమోదు చేయాలన్నారు. శిక్షణలో నేర్పిన మార్గ దర్శకాలను కచ్చితంగా పాటించాలని ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్‌లకు సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమం మొత్తం మూడు రోజుల పాటు కొనసాగుతుందన్నారు. జనగణన విధానం 36, కాలములతో ఉన్న ఫార్మ్‌ల నింపడం,డిజటల్ యాప్ వినియోగం, ఫీల్డ్‌లో ఎదురయ్యే సమస్యలను ఎలా పరిష్కరించాలి వంటి అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో మండల విద్యాధికారి చంద్రప్ప, ఉపాధ్యాయులు మాస్టర్ ట్రైనర్ వెంకటేశం, దివకర్ శాస్త్రి, ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.



కోట్‌పల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనగణన సర్వేపై ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీనివాస్

## కాంగ్రెస్ ప్రభుత్వ కులగణన రిపోర్టు అబద్ధాల పుట్ట

### ..మండల మాలమహనాడు అధ్యక్షుడు అంజయ్య

**పెద్దేముల్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన కులగణన నివేదిక పూర్తిగా తప్పుల తడకగా ఉందని, ఇది మాల సామాజికవర్గ అస్తిత్వాన్ని దెబ్బతీసేలా ఉందని మండల మాల మహనాడు అధ్యక్షుడు అంజయ్య కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డాడు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ అన్ని కులాల జనాభా పెరిగితే కేవలం మాల కులం జనాభాను తగ్గిచ్చి చూపెట్టడం చూస్తే ఈ ప్రభుత్వం మాలలకు ఎంత అన్యాయం చేస్తుందోఅర్థమవుతుందని అన్నారు. బెడా బుడగ జంగాలు, మాల సాలే, నేతకాని, మహర్, మాదాసి, మాల దాసరి,బేగరి వంటి మాల అనుబంధ కులాలను వేరు చేసిచూపడం ద్వారా మాల సామాజిక వర్గ బలాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాలలను తుడిచిపెట్టాలని చూస్తే, మాలల పంతం కాంగ్రెస్ అంతం అవుతుందని హెచ్చరించారు. తప్పుడు రిపోర్టును వెనక్కి తీసుకొని పారదర్శకమైన గణన చేపట్టాలని డిమాండ్ చేశారు.లేని పక్షములో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మల్లేశం, శ్రీనివాస్, రమకాంత్, బలరాం, బందెప్ప, రాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి

**ధారూర్, ఏప్రిల్ 18, ప్రభాత వార్త:** రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరిస్తుందని ధారూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రం గురించి ఆయన మీడియా సభ్యులతో మాట్లాడారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ రబీ సీజన్‌లో రైతులు పెద్ద ఎత్తున మొక్కజొన్న సాగు చేసిన విషయాన్ని స్పీకర్ ప్రసాద్ కుమార్,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి జిల్లాలో ఐదు కొనుగోలు కేంద్రాలను మంజూరు చేశారని, ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ఈనెల 16వ తేదీనే వెలువడ్డాయని ఆయన స్పష్టం చేశారు. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో రబీ సీజన్‌లో ఎన్నడూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవని విజయభాస్కర్ రెడ్డి విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికే కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించినప్పటికీ, కావాలనే బిఆర్ఎస్ నాయకులు రైతులను రెచ్చగొట్టేందుకు మాజీ మంత్రిని పిలిపించి నాగ్ సాన్ పల్లిలో నిరసన కార్యక్రమాలు చేపట్టడం దురదృష్టకరమన్నారు. ఇది కేవలం రాజకీయ లబ్ధి కోసమే చేస్తున్న డ్రామా అని ఆయన కొట్టిపారేశారు. ఈ ఏడాది మొక్కజొన్న క్వింటాల్‌కు 2400 రూపాయల మద్దతు ధర ప్రభుత్వం ప్రకటించిందని, కాబట్టి మండల రైతులు దళారులను కానీ, కమీషన్ ఏజెంట్లను కానీ సంప్రదించి మోసపోవద్దని కోరారు.రైతులు నేరుగా కొనుగోలు కేంద్రాలకు వచ్చి తమ పంటను అమ్ముకొని మద్దతు ధర పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



## నూతన గ్రామ కమిటీల ఏర్పాటుపై కీలక సమావేశం

**ధారూర్, ఏప్రిల్ 18, ప్రభాత వార్త:** తెలంగాణ రాష్ట్ర శాసనసభపతి, వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు ధారూర్ మండల పరిధిలోని మున్నూరు సోమారం, ధర్మపూర్, నర్సాపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ కమిటీల ఏర్పాటుపై శనివారం కీలక సమావేశం నిర్వహించారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విభాగం జనరల్ సెక్రటరీ చామల రఘుపతి రెడ్డి, వికారాబాద్ జిల్లా డీసీసీ కార్యదర్శి బాబా ఖాన్, ధారూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాన్ సింగ్, ధారూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తపల్లి విజయ్ భాస్కర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ రాములన్న ఆధ్వర్యంలో ఈ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు సమావేశమై పార్టీ బలోపేతంపై చర్చించారు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం కష్టపడే నిజమైన కార్యకర్తలను గుర్తించి, నిరంతరం ప్రజల్లో ఉంటూ యాక్టివ్‌గా పనిచేసే వారికే నూతన కమిటీల్లో చోటు కల్పించాలని కార్యకర్తలు నాయకులను కోరారు.అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, సమన్వయంతో త్వరలోనే గ్రామ స్థాయి నూతన కమిటీలను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుజ్జయ్య గౌడ్, రమేష్ ,కృష్ణ, యాదగిరి, రాము యాదవ్, సిద్ధు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



గ్రామంలో సమావేశం నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు

## బసవేశ్వర జయంతిని నిర్వహించండి

**చౌడపూర్, ఏప్రిల్ 18,ప్రభాతవార్త :**

కుల, లింగ వర్ణ వివక్షలకు వ్యతిరేకంగా పోరాడి, సమసమాజ నిర్మాణానికి కృషి చేసిన మహనీయుడు బసవేశ్వరుడి జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని, మండల తహసిల్దార్ వెంకటేశ్వర్లు, సూపరిడెంట్ రమేష్ కు చౌడపూర్ మండల లింగాయత్ సమాజం నుండి వినతి పత్రం అందించారు. సోమవారం మండల కేంద్రంలో జరగబోయే 893వ మహాత్మా బసవేశ్వర జయంతి వేడుకలను అట్టహాసంగా నిర్వ హించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజ సభ్యులు, పరిసర గ్రామ పెద్దలు రాజశేఖర్, అనంతరెడ్డి, పాల నరసింహులు, డాక్టర్ శరభలింగం, చంద్రశేఖర్, శశిధర్,,పుల్లప్ప,అశోక్ , వినయ్ ,రాములు, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ వెంకటేశ్వర్లు,సూపరిడెంట్ రమేష్‌లకు వినతిపత్రం అందజేస్తున్న లింగాయత్ సమాజం సభ్యులు

## పాఠశాల అభివృద్ధికి నెల జీతం అందించిన ఉపాధ్యాయుడు

**చౌడపూర్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** మండల పరిధిలోని పుర్సంపల్లి పాఠశాలలో విధులు




ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ రెడ్డిని సన్మానిస్తున్న యువజన సంఘం నాయకులు

నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ రెడ్డి, తాను పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి కొరకు, విద్యార్థుల అవసరాల కొరకు ఒక నెల జీతాన్ని విరాళంగా ప్రకటించడం పట్ల పలు సంఘాల నాయకులు తన ఉదారతను అభినందించారు.పాఠశాల అభివృద్ధి కొరకు ఉపాధ్యాయుడే ముందుకు రావడం పట్ల ,పలువురికి ఆదర్శంగా నిలిచాడని , చంద్రశేఖర్ రెడ్డి ని శనివారం పుర్సంపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఆయనను సన్మానించారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షులు వెంకటేష్, మండల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు అశోక్, సల్మాబేగం , పుర్సంపల్లి అంబేద్కర్ యువజన సంఘాల అధ్యక్షులు మాజీ యాదయ్య,చాకలి యాదయ్య,ముదిరాజ్ సంఘాల నాయకులు బోయిని బాలరాజ్ , కుంటి సిద్దు,మధుచారి, మొగులయ్య, బ్యాగరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.